పోరాట ప్రేరణ...
చట్టసభకు నిర్దేశన
వీరనారి మల్లు స్వరాజ్యం - 4వ పేజీలో

43391

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

# స్నేహ

సెప్టెంబర్ 13, 2009

# కీకారణ్యం నల్లమల అభయారణ్యం

# హ్యాపీ బర్త్‌డే

(2009 సెప్టెంబర్ 13 నుంచి 2009 సెప్టెంబర్ 19 వరకు)

బి. ధీరజ్
2సం॥, సెప్టెంబర్-18
అంజలికుమారి-శ్రీనివాసరావు
బలాజీనగర్-గుంటూరు

ఎన్. శ్రీహర్ష
9సం॥, సెప్టెంబర్-15
మాధవి-శ్రీమన్నారాయణ
తిరుపతి

ఎ. ఫణిగీతాంజలి
2సం॥, సెప్టెంబర్-12
సరిత-సంతోష్
ఆర్.కె.పురం-హైదరాబాద్

అక్షయ్
సెప్టెంబర్-13
గోవిందమ్మ-సాయన్నచారి
ఓల్డ్‌బోయినపల్లి-రంగారెడ్డి

బి. ఝాన్సీ
4సం॥, సెప్టెంబర్-15
రామలక్ష్మి-శ్రీనివాస్

జె.నవీన్‌బాబు
9 సం॥, సెప్టెంబర్-2000
రమాదేవి-రమేష్‌బాబు
అక్కిరెడ్డిపాలెం-విశాఖపట్నం

గాయత్రి
సెప్టెంబర్-13
రాజేశ్వరి-శ్రీధర్
అయిటిపాముల-నల్లగొండ

టి. హాసిని
3సం॥, సెప్టెంబర్-15
వరలక్ష్మి-లోవరాజు
రాజేంద్రనగర్-రాజమండ్రి

బి. సాయి గౌతమ్
3సం॥, సెప్టెంబర్-15
సునీత-శ్రీనివాస్
రాజేంద్రనగర్-రాజమండ్రి

## ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

కథా నిలయం
శ్రీకాకుళం

మనలో మాట

# మిని'స్టా'ర్లు

సరుకుల ధరలు తారలు చేరాయి. పచారీ కొట్టుకెళితే పగలే చుక్కలు కనపడుతున్నాయి. 'ధరలు దిగే దారే లేదా?' అని మనం తర్జనభర్జన పడుతుంటే- కొంతమంది అమాత్యులు ఏకంగా 'నక్షత్రాల్లోనే' దర్జా వెలగబెడుతున్నారు. ఇలాంటి నేతలకు మన వెతలెలా తెలుస్తాయి. మంది సొమ్ముతో చేసే మంత్రుల జల్సా మరి! ప్రజాస్వామ్యంలో మంత్రులే మహారాజులు. హంగూ ఆర్భాటాలూ, జల్సా దిలాసాలూ ఎన్నయినా చేసుకోవచ్చు. ఐదు నక్షత్రాల హోటళ్లలో హాయిగా సేద తీరతారు.

ఢిల్లీలో అమాత్యులు బస చేసే ప్రభుత్వ నిలయాలకు, భవనాలకు కొదవ లేదు. అయినా, మన విదేశాంగ మంత్రివర్యులు ఢిల్లీలోని ఓ తారాస్థాయి హోటల్లో బస చేశారు. అందుకు రోజుకయ్యే ఖర్చు అక్షరాలా లక్ష! ఏ వెరపూ జడుపూ లేకుండా ఆయన మూణ్ణెళ్లగా అదే హోటల్లో గడుపుతున్నారు! తాజాగా బిల్లు చూస్తే రూ.కోటి దాటింది! మరో కేంద్రమంత్రిగారిది కూడా అదే వరస. ఆ మంత్రులు ఒక్క రోజు వెచ్చించే లక్షతో దాదాపు ఐదు వేలమంది సామాన్యులు ముప్పూటలా తినొచ్చు. ప్రస్తుతం దేశంలో 84 కోట్ల మంది రోజువారీ సంపాదన ఇరవై రూపాయలే! సంక్షేమ హాస్టళ్ల పిల్లలకు రోజుకు కేటాయించిన మొత్తం పదిహేడు రూపాయలే! దేశజనం డబ్బులేమితో బాధపడుతుంటే- మంత్రిగణం జల్సా జబ్బుతో బాధపడుతోంది మరి!

మునుపటికో కేంద్ర మంత్రి గ్లాసెడు పాలు తాగటానికి ఢిల్లీ నుంచి బీహారుకు విమానంమీద వచ్చిపోయేవాడట! అందుకయ్యే ఖర్చు జన ఖజానా నుంచే జమయ్యేది. నేతలు తేనేటికి, తాగునీటికీ కూడా వేలల్లోనే వెచ్చిస్తారు. భావి ప్రధానిగా ప్రచారం పొందుతున్న యువ నాయకుడు ఆ మధ్య హైదరాబాద్‌లో 'సామాన్యుల్లో సామాన్యుడిగా కలిసిపోయి' అల్పాహారం తీసుకుంటే అయిన ఖర్చు రూ.582.

అంచేతనే నక్షత్రాల్లో విహరించే నేతలది ఒక దారి. నేలమీద నడిచే మనుషులది మరో దారి. సామాన్యుల కష్టాలు వారికంత ఈజీగా అర్థం కావు. 'కందిపప్పు కొండెక్కినా, బియ్యం బరువెక్కినా- అంతా వందల్లోనే అయిపోతుంది. సామాన్యుడిది ఎంతటి చౌక బతుకు' అని బహుశా మన మంత్రి మహారాజులకు అనిపిస్తూ ఉంటుంది. అందుకనే ధరల దరువుపై ఎంత మొత్తుకున్నా చలించరు. స్టార్ హోటళ్లలో మినిస్టార్ల బతికే మినిస్టర్లకెలా అర్థమౌతుంది సామాన్యుడి గోస. ★

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| టపా | ... | 2 |
| తెల్సా | ... | 3 |
| రుచి | ... | 9 |
| సీరియల్ | ... | 10 |
| బాలనేస్తాలు | ... | 12 |
| అట్టమీది కథ | ... | 14 |
| విజ్ఞాన వీచిక | ... | 17 |
| క్రైమ్ కథ | ... | 20 |
| స్పెయిన్ హోలీ | ... | 21 |
| కథ | ... | 22 |
| నవ్వుల్ పువ్వుల్ | ... | 24 |


## ఇంకా...

స్ఫూర్తి ... 4

పోరాట ప్రేరణ...

చట్టసభకు నిర్దేశన

చూద్దామా ... 6

మారుతున్న
ఆదివాసీ జీవితాలు

సినిమాకబుర్లు.. 18

సమాంతర చిత్రాలకే సత్కారం
వెలుగులేని తెలుగు సినిమా



## 'బంగీ' మంచి వ్యాసం

ఆగస్టు 30 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో "సాహసం సరదాల సమ్మిళితం బంగీజంప్" చదివిన తర్వాత ఎత్తైన భవనాలు, వంతెనలు ఆధారంగా చేసే బంగీజంప్ గూర్చి, దాని పుట్టుక గురించి ఈ వ్యాసం ద్వారా చాలా వివరాలు తెలుసుకున్నాం. 1825లో అబ్రేవేషన్ ఆఫ్ సమ్ ఆఫ్ డయలెక్ట్ ఇన్ ది వెస్ట్ ఆఫ్ ఇంగ్లాండ్" పుస్తకంలో జెన్నింగ్స్ 'బంగీజంప్' పదాన్ని ప్రస్తావించడం అభినందనీయం. మన దేశంలో బంగీజంప్ జరిగే ప్రదేశాలను వివరించడం హర్షణీయం. ఇంత మంచి వ్యాసాన్ని మాకోసం అందించడం అభినందనీయం.

కామిడి సతీష్‌రెడ్డి,

పరకాల, వరంగల్.

## గొప్ప మహిళ

"దాస్ కాపిటల్" సిద్ధాంతం ప్రపంచంలో కోట్లాది ప్రజలను ప్రభావితం చేసింది. ప్రజల కష్టాల నివారణకు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రపంచంలో లక్షలాది మంది త్యాగాలు చేశారు. అంతటి గొప్ప సిద్ధాంతకర్తకు చేదోడుగా వున్న వారు ఇద్దరు. వారిలో ఒకరు ఫెడరిక్ ఏంగిల్స్, ఇంకొకరు జెన్నీమార్క్స్. కడు పేదరికాన్ని అనుభవిస్తూ ఇంటి అద్దె చెల్లించనందుకు యజమాని సామాన్లు బయటపడేసినా జెన్నీమార్క్స్‌కు అండగా వుంటూ కృషి చేసినందునే మార్క్స్ సిద్ధాంతం బయటకు వచ్చింది. ఐద్వా నాయకురాలు కామ్రేడ్ భిక్షవతిగార్కి నమస్సులు.

టి. శ్రీరామమూర్తి,

గాజువాక, విశాఖ.

## ఉద్వేగాలను చక్కగా వివరించారు

ఈ వారం స్ఫూర్తి మాకు బాగా నచ్చింది. ఎందరికో స్ఫూర్తిదాయకంగా వున్న జెన్నీమార్క్స్ పుస్తకం ఎన్ని సార్లు చదివినా ఇంకా చదవాలనిపిస్తుంది. ఎండ్లూరి ప్రభాకర్ గారు పిల్లల్లో వచ్చే అసాధారణ ప్రవర్తన గురించి, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చక్కగా వివరించారు. ఆయా కథ బాగుంది. అట్టమీది కథగా వచ్చిన 'ఉద్వేగాల చెలగాటం'లో నేడు వివిధ చానళ్లలో వస్తున్న ప్రోగ్రాముల గురించి చక్కగా వివరించారు. ఏ ఛానెల్ చూసినా ఏముంది గర్వకారణం అనే విధంగా ఏ రియాల్టీ షో చూసినా ఒకటే గోల... ఏడుపులు.. పెడబొబ్బలు... ఏదో కొంపలు మునిగిపోయినట్లు పెద్ద సీను క్రియేట్ చేసి అరగంటలో ముగిసిపోయేదాన్ని వారాలకు వారాలు సాగదీసి జనాలు విసిగిపోయేలా చేయడానికే ఈ ప్రోగ్రాములు వున్నాయేమో అనిపించేలా వున్నాయనడంలో సందేహం లేదు. బంగీజంప్ గురించి మాకు తెలియని విషయాలెన్నో ఈ శీర్షిక చదివి తెలుసుకున్నాం.

విజయ్, పిడుగురాళ్ల.

## ...ఉత్తరం ఓకే

ఆగస్టు 30 వ తేదీ స్నేహలో మనలోమాట 'దేవుడికైనా ఒక వుత్తరం' బాగుంది. ఇకనుండి దేవుడి వస్తువులను రక్షించడానికైనా ఒక రక్షకుణ్ణి ఆయనే ఏర్పాటు చేసుకుంటే బావుంటుందేమో! కొబ్బరుండలు, సగ్గుబియ్యం వడలు బాగున్నాయి. ఈ వారం కథ చదువుతుంటే ముసలి తనానికి పిల్లల దగ్గరికి వెళ్లాలా వద్దా అనే అలోచనే ముందుగా వస్తుంది. విజ్ఞాన వీచికలో చెప్పినట్లు ఆలోచనా విధానంతోనే కాకుండా జన్యువులను బట్టి కూడా నేర ప్రవృత్తి వుంటుందని తెలుసుకున్నాం. చివరి పేజీలోని ఫొటో ఫీచర్‌లోని ఫొటోలు నిజంగా వేటికవే చాలా బాగున్నాయి.

రాధిక, ఒంగోలు.

## బంగీజంప్ నచ్చింది బాస్

ఈ వారం అట్టమీది కథ చాలా బాగుంది. టీవీల్లో వచ్చే రియాల్టీ షోల గురించి ఇంత బాగా వివరించినందుకు పీపీ గార్కి అభినందనలు. ఈ లైవ్ షోలు, రియాల్టీ షోలతో జనం విసిగిపోక ముందే ఆయా చానెళ్లవారు గమనించి వారి అతి పోకడలను మార్చుకుంటే బాగుంటుందేమో. ఒకప్పుడు జనం సినిమాల్లోని సెంటిమెంట్లతో విసిగి టీవీ సీరియళ్లని, లైవ్ షోలని ఇష్టపడ్డారు. కానీ ఇప్పుడు వస్తున్న ఈ ప్రోగ్రాముల్ని చూసి వీటి కంటే ఆ సినిమాలే నయం అనుకునేట్టుగా వుంటున్నాయి. బంగీజంప్ వివరించిన తీరు బాగుంది. మనలోమాట మాకు బాగా నచ్చింది.

సుజాత, నెల్లూరు.

## 'ఆయా' యువతకు కనువిప్పు కావాలి

ఆగస్టు 30వ తేదీ సంచిక స్నేహ అందరినీ అలరించింది. 'అలీబాబా 40 దొంగల కథ' అట్టచివర ముద్రించి ప్రతి పేజీని వినియోగించుకోవడంలో సిద్ధహస్తులని చెప్పక చెప్పారు. బీర్బల్ కథలను కూడా ధారావాహికగా ప్రచురిస్తే బాగుంటుంది. సెంటర్ పేజీ అంతా పిల్లల కోసం కేటాయించడం బావుంది. ఆకులతో మూషికం నచ్చింది. కేంద్రీయ విద్యాలయంలో అవే నేర్పిస్తున్నారు. "ఆయా" కథ నేటి యువతకు కనువిప్పు కావాలి. బంగీజంప్ గురించి తెలియని ఎన్నో విషయాలు పొందుపరిచినందుకు ధన్యవాదాలు. నవ్వుల్ పువ్వుల్ భలేగా కడుపుబ్బ నవ్విస్తున్నాయి. హ్యాపీ బర్త్‌డే శీర్షిక సూపర్బ్. పజిల్ కోసం ఓ పేజీ కేటాయిస్తే బాగుంటుంది కదా!

పక్కి బాలకృష్ణారావు,

విజయనగరం.

★

## ఎవరీ...మె?

ఇంత లావున, ఇంత పొడవున వుంది? ఇంత లావున, ఇంత పొడవున వుంది?

ఎవరబ్బా...అనుకుంటున్నారా? టాన్యా అవన్. అమెరికా వాసి. పొడవు ఎంతా! సింపుల్‌గా 6 అడుగుల 6 అంగుళాలే. ఇంక బరువు ఎంతంటారా? అదీ సింపులే. వంద కేజీలపైనే. దీనికే ఇంత ఆశ్చర్యపోతున్నారేం! ఈవిడ ఇంకా పొడవు, బరువు పెరుగుతూనే వుంది. అదేం అంటారా! పాపం ఈవిడ ఒక వింత జబ్బుతో బాధపడుతోంది. ఈ లక్షణాలవల్లే ప్రేమికుడు కూడా ఆమెకు దూరమయ్యాడు. విపరీతమైన పెరుగుదల ఆమె కౌమారదశలోనే ప్రారంభమైంది. దీన్ని ఆపడానికి వాడని మందు లేదు! కలవని డాక్టర్ లేడు!! ఎప్పటికైనా ఆ సమస్య నుంచి బైటపడతానని అందరిలా మామూలుగా జీవిస్తానని ఆశగా రోజులు నెట్టుకొస్తోంది టాన్యా.

## బుల్లెట్ బుల్లోడు

ఈ ఢిల్లీ బుల్లోడి పేరు అజీమ్‌ఖాన్. వయసెంతా! మూడేళ్లే. అయితేనేం రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ఎక్కాడూ అంటే దూసుకుపోవాల్సిందే. అంత పసోడికి లైసెన్స్ వుండదుకదా అనుకుంటున్నారా? ఈ పిడుగు బైక్ నడిపే వైనం చూసిన అధికారులు ముచ్చటపడిపోయి ప్రత్యేక అనుమతి ఇచ్చేశారు. ఇంతకీ బ్రేకులు అవీ వేయాలంటే కాళ్లు అందవుకదా అన్నదేకదా మీ అనుమానం. కాళ్లు అందకపోతేనేమి? వాటినే ఈ చిన్నారి కాళ్ల దగ్గరకు వచ్చేలా పెద్దవి చేయించాడు తండ్రి. ఇప్పటికి మాత్రం మెయిన్ రోడ్లమీదకి తండ్రి లేకుండా వెళ్లడంలేదు కానీ... గల్లీల్లో మాత్రం వంటరిగానే నడిపేస్తున్నాడు. ఈ విషయంలో అజీమ్ తండ్రి ఏమంటాడో తెల్సా! "నాకు అజీమ్ మీద నమ్మకముందికానీ... రోడ్లమీద వచ్చే ఇతర వాహనచోదకుల మీదే విశ్వాసం లేదు. అందుకే మెయిన్ రోడ్లమీదకు వచ్చినప్పుడు మాత్రం నేను వెనకే కూర్చుంటా" అంటాడు.

# తెల్సా!

## పేద్ద నాసిక!

వావ్ ఎంత పేద్ద ముక్కు? అనుకుంటున్నారా? ఈయనకు గుర్తింపు తెచ్చిపెట్టింది ఆ ముక్కేనండీ బాబూ. ఎలాగంటే... ఈయనగారి ముక్కు 8.8 సెంటీమీటర్ల పొడవుంటుంది. అదీ 2007, జులై 6న కొలిచినప్పుడు అంత పొడవుంది. ఆ తర్వాతగానీ ఇంకా పొడవు పెరిగిందో ఏమో ఆయనగారికే తెలియాలి. ఈ పొడవాటి నాసిక కలిగిన ఈ పెద్దమనిషి పేరు మెహ్మద్ ఒజేరెక్. ప్రస్తుతానికి ఆయన నివాసం టర్కీలో. ఆ ముఖ్యమైన సంగతి చెప్పడం మరిచాం. ప్రపంచంలోకెల్లా పొడవాటి ముక్కు గల వ్యక్తిగా రికార్డు సృష్టించేశాడు. రికార్డు మాటెలా వున్నా కాఫీ టీ తాగేటప్పుడే

కొద్దిగా ఇబ్బంది పడాలి! ఏమంటారు?!



## దిళ్ల ఫైటింగ్

ఏంటి అలా చూస్తారు? నిజంగానే దిళ్లతో ఒక ఆట వుంది బాసూ! మన ఇళ్లల్లో కూడా నిద్రకు ఉపక్రమించబోయేముందు మన పిడుగులు చేసే పని అదేకదా. కొప్పడి వాళ్లను పడుకోబెట్టేసరికి తల ప్రాణం తోకకొస్తుందికదా. అయితే అదే ఆటను జపాన్ వంటి కొన్ని దేశాల్లో ప్రముఖంగా ఆడుతుంటారు. ఇంతకీ ఈ ఆటను అక్కడేమని పిలుస్తారో తెల్సా! 'మకురా-నగే' అని అంటారు. 'మకురా' అంటే దిండు. 'నగే' అంటే విసరడం. దీన్ని ఎక్కువగా పిల్లలే ఆడతారు. దిళ్లను ఒకరిమీదొకరు విసురుకుంటారు. ఎదుటివారు దిండుతో కొడుతుంటే రెండవ వారు వాటినుంచి తప్పించుకోవడానికి ఉపయోగించేది కడా దిండునే. అయితే ఈ ఆటకీ కొన్ని షరతులున్నాయి. దిండుతో ప్రత్యర్థిని పొట్టమీద కానీ, కాళ్లమీద కానీ కొట్టాలి. ఇందులో దెబ్బలు తగిలే అవకాశాలు తక్కువ. దిళ్లు పగిలిపోయి ఈకలు, దూది బయటికొస్తుంటుంటే భలే మజాగా వుంటుంది. ఆడేవాళ్లకే కాదు చూసేవాళ్లకు కూడా.

స్ఫూర్తి

**మల్లు స్వరాజ్యం,**
తెలంగాణా వీరనారి,
సిపిఐఎం సీనియర్ నాయకురాలు.

# పోరాట ప్రేరణ... చట్టసభకు నిర్దేశన

**మొ**దట్లో మాకు పార్య పుస్తకాలు, దేవుని పుస్తకాలు మాత్రమే అందేవి. అవి తప్ప మాకు వేరే పుస్తకాల గురించి తెలియదు. ఆనోట ఆనోట విన్న రుద్రమదేవి కథను మా అమ్మ మాకు చెప్పేది. మా మేనమామ పిల్లలు భగత్‌సింగ్ గురించి చెప్పేవారు. నాన్నకు భూస్వామ్య స్వభావం వున్నా... నేను రుద్రమదేవిలా, ఝాన్సీ లక్ష్మీబాయిలా కావాలని కోరుకునేవాడు. ఫ్యూడలిస్టులు హీరోయిజం వుండాలని కోరుకోవడానికి కారణం ... వాళ్ల పెత్తనం జరగాలి కాబట్టి. నాన్న కూడా అంతే.

'అమ్మ' నవలను 1943లో...అంటే నాకు పన్నెండేళ్లప్పుడు చదివా. బహుశా ధర్మభిక్షంగారో, దేవులపల్లి వెంకటేశ్వరరావుగారో ఇచ్చుంటారు. వాళ్ల హాస్టల్ నడుపుతూ అక్కడి విద్యార్థులకు విప్లవ సాహిత్యం అందిస్తుండేవారు. వి.ఎన్ (మల్లు వెంకట నరసింహారెడ్డి) కూడా అక్కడే వుండి చదువుకుంటూ విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్నారు. ఓసారి ధర్మభిక్షంగారు అరెస్టయి సూర్యాపేట జైల్లో వుంటే ... వి.ఎన్, మరో ఇద్దరు కామ్రేడ్లు జైలు కిటికీ చువ్వలు కోసి మరీ ఆయనను విడిపించారు. తర్వాత చదువును బాయ్‌కాట్ చేయమన్న పిలుపును అందుకొని తెలంగాణా పోరాటంలోకి వచ్చారు వి.ఎన్. ఇక నా విషయానికొస్తే... 'అమ్మ'కంటే ముందు ఏ పుస్తకం చదవలా! ఆ పుస్తకం వల్ల చెరగని ముద్ర పడింది. ఈ ఉద్యమంలో పాల్గొంటే తప్పక విజయం సాధిస్తాం. రష్యాలాగానే భారత్‌ని కూడా విముక్తి చేస్తామన్నది నా ఊహ.

మా ఇంట్లో మా అమ్మ, మేనత్త కూడా 'అమ్మ' నవల విన్నారు. నేనే చదివి వినిపించా. మాకు ఏడు గేదల పాడి వుండేది. రాత్రిళ్లు ఆ పాలన్నీ కాగబెట్టి తోడుబెట్టడానికి చాలా సమయం పట్టేది. ఆ సమయంలో వారికి ఏదైనా కాలక్షేపం కావాలి. పైగా అప్పట్లో భూస్వాముల ఇళ్లల్లో సాహిత్యం పట్ల ఆసక్తి వుండేది. కానీ చదివే అవకాశం వుండేదికాదు. నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకున్న వాళ్ల వెంట పడేవాళ్లు. 'అది చదివి పెట్టండి. ఇది చదివిపెట్టండి' అని అడుగుతుండేవాళ్లు. భారత,భాగవత కథలు వినిపించుకునేవారు. ఇక్కడ ఓ మాట తప్పక చెప్పుకోవాలి. మా అమ్మ మీద కూడా 'అమ్మ' ముద్ర బాగానే పడింది. ఆమెకు భూస్వామ్య వ్యతిరేకత వుండేది. పేదల పట్ల సానుభూతి వుండేది. తన కొడుకు (బిఎన్) కూడా పాషా ('అమ్మ' హీరో పావెల్) అవుతాడని చెప్పేది. ఓసారి పోలీసులు అన్న బిఎన్ కోసం వెతుకుతూ వచ్చి "నీ కొడుకు దొంగలాగా తిరుగుతున్నాడు. ఎక్కడుందీ చెప్తావా లేదా" అని స్టేషన్‌కు పట్టుకుపోయి అడుగుతుంటే..."నా బిడ్డ తిండి లేక పోలేదు. తిండి కోసం పోలేదు. దేశం కోసం పోయాడు. నేను వాడిని భారతమాతకు అప్పచెప్పిన. భారతమాత బిడ్డలే వాడిని కాపాడతారు. మీరే ఏదో ఒకనాడు గాంధీకి మాదిరిగా నా బిడ్డకు సెల్యూట్ కొడతారు" అన్నది. ఆమెకు అక్షరం ముక్క రాదు. అయినా 'అమ్మ' ప్రభావం ఆమె మీద అంతగా పడింది. అయితే మా అమ్మ ప్రభావం నా మీద పడింది.

చిన్నతనంలోనే గుర్రపు స్వారీ నేర్చుకున్నా. నాన్ననే నేర్పించిండు. అయితే ఎప్పుడు పార్టీ సభ్యురాలినయ్యాననేది మాత్రం కచ్చితంగా చెప్పలేను. పాటలు పాడుకుంటూ...ఉద్యమకారుల వెంట తిరుగుతుండేదాన్ని.ఆ సమయంలో మా మేనత్తగారింట్లో వుంటూ క్రూరుడు విసునూరు జమిందారుకు వ్యతిరేకంగా పెద్ద ఉయ్యాలపాట నోటనే కట్టి నోటనే అల్లి దాదాపు 30 గ్రామాలు తిరిగి పాడినం. ఆ ప్రభావం ప్రజలపై చాలా పడింది. అందుకు నేను ఎంతో ఉత్తేజపడ్డా. అప్పుడు కూడా 'అమ్మ' పుస్తకం జ్ఞాపకం వచ్చేది. నా పదహారవ ఏట తుపాకి పట్టినా. కమ్యూనిస్టు పార్టీ, గ్రామాలను నిజాం సైన్యాల నుంచి విముక్తి చేస్తూ గ్రామ స్వపరిపాలన ఏర్పాటుచేసింది. గ్రామరక్షక దళాలను ఏర్పాటు చేస్తూ పంచసభ్యుల కమిటీలు ఏర్పాటుచేసింది. ప్రతికమిటీలోనూ ఇద్దరు మహిళాసభ్యులుండేవారు. అందులో నేను క్రియాశీలకంగా పాల్గొన్నా. 'అమ్మ' పుస్తకంలోలా ఇక్కడ కూడా విముక్తి చేయాలని ఆరాటపడ్డా. గ్రామ పరిపాలన చేసే దళంలో వున్నా. అందుకే నన్ను పట్టుకుంటే పదివేల రూపాయల బహుమానం ప్రకటించారు పోలీసులు. అదలా వుంటే తెలంగాణా పోరాటానికి ఆయుధాలకవసరమైన ఆర్థిక సహాయం కోసం, రాజకీయ మద్దతును సాధించడంకోసం ఆంధ్రాలో ప్రచారం చేయాలని పార్టీ నిర్ణయించింది. ఆ బాధ్యత నాకు అప్పగించింది. మద్రాసు నుంచి విజయనగరం వరకు వంద సభలు నిర్వహించాం. అందులో వావిలాల గోపాలకృష్ణయ్య, నేను నిర్విరామంగా వరుసగా పాల్గొన్నాం. మంచి స్పందన వచ్చింది. ఆయుధాలకవసరమైన నిధులకోసం పరికిణీ, ఓణీ

అన్న బిఎన్ రెండు దఫాలు ఎమ్మెల్యే అయినా అంతవరకు నేను ఒక్కసారి కూడా అసెంబ్లీ మొహం చూసెరగను. ఎందుకంటే అప్పట్లో నేను వ్యవసాయం పనిలో వున్నా. అయినా ఉద్యమంలో పిల్లల్ని చంకనేసుకునే పాల్గొన్నా. ఇప్పుడు ఎమ్మెల్యేగా ఎలా పని చేయాల్నా? అని మదనపడే సమయంలో వియన్‌గారు ఎకెజి పుస్తకం చదవమని చెప్పారు. ప్రజల మధ్య పోరాటాలలో మునిగి తేలే ఎ.కె.గోపాలన్ పార్లమెంటు సభ్యుడయ్యాక ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పును, మనస్తత్వాన్ని అందులో చాలా గొప్పగా రాశారు. వారిపై ప్రలోభాలు ఎంత తీవ్రంగా వుంటాయో కళ్లకు కట్టించారు. వాటికి అతీతంగా నిలబడాల్సిన తీరును చెప్పారు. అందుకే నామీద 'అమ్మ' ముద్ర ఎంతగా పడ్డదో, ఈ పుస్తకం కూడా అంతటి ముద్ర వేసింది. ఎమ్మెల్యేగా పనిచేయడానికి స్ఫూర్తినిచ్చిన పుస్తకమది.

వేసుకున్న నేను ఓణీ చాపితే మోయలేనన్ని చిల్లరనాణేలు వేశారు. ఆ సంఘటనతో నేనెంతో ఉత్తేజపడ్డాను. అప్పట్లో నన్ను పెద్దలు 'ఆంధ్రదేశపు ముద్దుబిడ్డ' అని పిల్చేవాళ్లు.

ఒక విప్లవ ఉద్యమాన్ని గురించి ఫీల్డ్ క్లాస్ వంటిది 'అమ్మ' పుస్తకం. అసలు ప్రజలెలా వుంటారు? ప్రజలతో సంబంధం ఎలా వుంటుంది? రాచరికపు వ్యవస్థ ఎలా వుంటుంది? దానికి వ్యతిరేకంగా ప్రజల బాధలేంటి? ప్రజలకోసం పనిచేయాలనుకునే మానవతా దృక్పధం వున్న వాళ్లు దేశభక్తిని ఎలా నింపుకుంటారు? వంటి విషయాలను వివరించిన పుస్తకం అది. ప్రజలే దళం. ప్రజానీకంలో ఎక్కువభాగం బానిసవ్యవస్థలో పడి కొట్టుమిట్టాడుతోంది. దాన్ని మార్చేందుకై పోరాడడానికి పునాది స్ఫూర్తినిన్న పుస్తకం 'అమ్మ'. (2వ బాక్స్)చాలా రోజులపాటు మేం ఎక్కడికెళితే అక్కడికి వెంట 'అమ్మ' నవలను మోసుకుపోయినం. చదవమని చెప్పినం. చదివినం, చదివి వినిపించినం. ఇప్పుడు మరుపు వచ్చిందికానీ అప్పట్లో ఆ కథంతా సినిమా చూసినట్టు రీలు మాదిరిగా బుర్రలో తిరుగుతుండేది.

'అమ్మ' తర్వాత స్ఫూర్తినిచ్చిన పుస్తకం ఎ.కె.గోపాలన్ ఆత్మకథ 'ప్రజాసేవలో నా అనుభవాలు'. ఈ ముచ్చట చెప్పాలంటే దీనికి ముందు జరిగిన సంఘటన చెప్పాలి. అసలు నేను ఎమ్మెల్యేగా నిలబడనన్నా. అసెంబ్లీకి పోతే ఇంగ్లీషు రాదు. నేనేం స్టడీ చేస్తాను. వియన్‌గారినే నిలబెట్టమన్నా. చివరకు తప్పక నేనే నిలబడిన. గెల్చిన. తీరా మొదటిసారి అసెంబ్లీ లోపలికి వెళ్లబోతే సెక్యూరిటీ గార్డ్ నన్ను అడ్డుకున్నాడు. "ఏం ఎందుకు పోనివ్వవు. వాళ్లంతా పోతున్నారుగా" అన్నా. "గెల్చినోళ్లే లోపలికి పోవాలి" అన్నాడు. "నేనూ గెల్చినకదా" అన్నా. అంతేకానీ "ఎమ్మెల్యేగా నేనూ గెల్చానుకదా" అని మాత్రం అనలేకపోయినా. అతను నా వేషభాషలు చూసి లోపలికి పోనివ్వలేదు. ఈలోగా ఓంకార్ గారొచ్చి "ఎవరనుకుంటున్నావ్? ఈమె పెద్ద కమ్యూనిస్టు లీడరు. ఎమ్మెల్యే" అని చెప్పాక నన్ను లోపలికి పోనిచ్చాడతను. 1954లో వియన్‌తో నా పెళ్లి జరిగింది హైదరాబాద్‌లోనే. అదీ దేవులపల్లి వెంకటేశ్వరరావుగారి క్వార్టర్‌లోనే. అప్పుడూ అసెంబ్లీని చూడలేదు. అన్న బిఎన్ రెండు దఫాలు ఎమ్మెల్యే అయినా అంతవరకు నేను ఒక్కసారి కూడా అసెంబ్లీ మొహం చూసెరగను. ఎందుకంటే అప్పట్లో నేను వ్యవసాయం పనిలో వున్నా. అయినా ఉద్యమంలో పిల్లల్ని చంకనేసుకునే పాల్గొన్నా. ఇప్పుడు ఎమ్మెల్యేగా ఎలా పని చేయాల్నా? అని మదనపడే సమయంలో వియన్‌గారు ఎకెజి పుస్తకం చదవమని చెప్పారు. ప్రజల మధ్య పోరాటాలలో మునిగి తేలే ఎ.కె.గోపాలన్ పార్లమెంటు సభ్యుడయ్యాక ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పును, మనస్తత్వాన్ని అందులో చాలా గొప్పగా రాశారు. వారిపై ప్రలోభాలు ఎంత తీవ్రంగా వుంటాయో కళ్లకు కట్టించారు. వాటికి అతీతంగా నిలబడాల్సిన తీరును చెప్పారు. అందుకే నామీద 'అమ్మ' ముద్ర ఎంతగా పడ్డదో, ఈ పుస్తకం కూడా అంతటి ముద్ర వేసింది. ఎమ్మెల్యేగా పనిచేయడానికి స్ఫూర్తినిచ్చిన పుస్తకమది. (1వ బాక్స్)

అసలు ఎ.కె.గోపాలన్ జీవితంలో ఎన్ని పోరాటాలు? ఎన్నెన్ని పోరాటాలు? పేదప్రజల కోసం ఎన్ని చేశాడు? ఎక్కడ అన్యాయం జరిగినా తక్షణ పరిష్కారం కోసం పరితపించిపోయేవాడు. నిరాహారదీక్షకు దిగేవాడు. అందుకే ఆ పుస్తకం చదివాక నాకు ఎమ్మెల్యేగా పనిచేయడానికి కావాల్సిన స్ఫూర్తి అందింది. ఎవరైనా ఇది కాలేదు అని వస్తే చాలు అధికారి దగ్గరకెళ్లి ఎప్పుడవుతుంది? ఎన్ని రోజుల్లో అవుతుంది అనడగడం... అతను చెప్పినలోపు పని అయితే సరి. లేకపోతే ధర్నాకు దిగడం...నిరాహారదీక్షకు కూర్చోవడం... అప్పట్లో ఓసారి లంబాడోళ్లమీద పోలీసులు అన్యాయంగా కేసుపెట్టారు. ఇదొక కథ. వినోభాభావే భూదానోద్యమం సందర్భంగా రావులపల్లి భూస్వాములు దాదాపు 600 ఎకరాలను లంబాడీలకు పంచారు. అయితే వినోభాభావే అటు వెళ్లగానే ఇటు ఆ పట్టాలను లాక్కొని భూస్వాములు దాచిపెట్టుకున్నారు. పొలం కూడా వాళ్లే ఎప్పటిలాగే పండించుకోసాగారు. ఇలా తండాల్లో అన్యాక్రాంతమైన భూమిని వారికప్పగించడానికి లంబాడోళ్లను కదిలించినా. అప్పుడా కాంగ్రెస్ భూస్వాములు తుపాకీలు చేపట్టి, కొంతమంది గూండాలను వెంట పెట్టుకొచ్చి కాల్పులు జరిపారు. ఆ ఖాళీ తూటాలు తెచ్చి స్పీకర్ ముందు పోసి ధర్నాకు దిగాను. అప్పుడూ ఎకెగోపాలన్ పుస్తకం ఇచ్చిన స్ఫూర్తి నాలో నిండా వుంది. ఆ కేసు పరిష్కరించాలని పూనుకున్నా. ఇద్దరు కానిస్టేబుళ్లను తీసుకొని భూస్వాముల గడికి వెళ్లా. లోపలికి వెళ్లకుండా వారినే బయటికి రమ్మన్నా. వచ్చారు. పట్టా కాగితాలు ఇమ్మన్నా. ఇవ్వకపోతే ఏంచేస్తారన్నారు. ధర్నా చేస్తానన్నా. అయినా ఇవ్వడానికి నిరాకరించారు. దాంతో జనంతో పాటు కలెక్టరు దగ్గరకుపోయి రికార్డులు ఇప్పించమన్నా. లేకపోతే అక్కడే ధర్నా చేస్తానన్నా. అప్పట్లో ఎమ్మెల్యేల ధర్నాలు చేసేవాళ్లు కాదు. తాసీల్దారు, సర్వేయర్‌ను తీసుకొని మళ్లీ భూస్వాముల గడి దగ్గరకెళ్లాను. మరో మార్గం లేక పట్టాలు తాసీల్దారుకు అప్పచెప్పారు. మోదుగ చెట్టు కింద మూడు రోజుల పాటు మకాం వేసిన. సర్టిఫికెట్ల ప్రకారం గట్లు పెట్టించి లంబాడీలకు భూపంపిణీచేశాం. హైదరాబాదులో కరెంటు ఆఫీసుముందు అదే లంబాడీ జనాలతో ధర్నా చేయించి వ్యవసాయానికి విద్యుత్ సాధించుకున్నాం. ఇప్పటికీ వారే సాగుచేసుకుంటున్నారు. అలా కేసు పరిష్కారమై భూ పంపిణీ జరిగింది. రమజాబీపై అత్యాచారం జరిగినప్పుడు మాట్లాడ్డానికి కూడా అసెంబ్లీలో అనుమతివ్వలేదు. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లినప్పుడు అర్ధరాత్రి ఆమె వెంటే వున్నా. ఆ విషయాలను సభలో తోటి ఎమ్మెల్యేలకు చెప్తుంటే ..విని చలించిపోయారు. పట్టపగలు కూడా వెంట సెక్యూరిటీ లేకుండా బయటకు నడవని ఆ ఎమ్మెల్యేలు నేను

# అమ్మ

ఒక విప్లవ ఉద్యమాన్ని గురించి ఫీల్డ్ క్లాస్ వంటిది 'అమ్మ' పుస్తకం. అసలు ప్రజలెలా వుంటారు? ప్రజలతో సంబంధం ఎలా వుంటుంది? రాచరికపు వ్యవస్థ ఎలా వుంటుంది? దానికి వ్యతిరేకంగా ప్రజల బాధలేంటి? ప్రజలకోసం పనిచేయాలనుకునే మానవతా దృక్పథం వున్న వాళ్లు దేశభక్తిని ఎలా నింపుకుంటారు? వంటి విషయాలను వివరించిన పుస్తకం అది. ప్రజలే దళం. ప్రజానీకంలో ఎక్కువభాగం బానిసవ్యవస్థలో పడి కొట్టుమిట్టాడుతోంది. దాన్ని మార్చేందుకై పోరాడడానికి పునాది స్ఫూర్తినిచ్చిన పుస్తకం 'అమ్మ'.

చెప్పింది విని ఆశ్చర్యపోయి "అర్ధరాత్రి ఎట్లా వెళ్లావ్?" అని అడిగారు. పైగా ఈ విషయమై మాట్లాడ్డానికి సమయం ఇవ్వాల్సిందేనని స్పీకర్‌తో పోట్లాడి డిమాండ్ చేసి సాధించుకున్నాం. ఆడపిల్లలకు అన్యాయం జరగకుండా దండల పెళ్లిళ్లకు చట్టబద్ధత కల్పించమని పోరాడినా! మహిళాసంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కాలంలో ఆస్తిహక్కుకోసం ఉద్యమమే చేసి సాధించినాం. ఇది ఏ రాష్ట్రంలో లేదప్పట్లో. ఇవన్నీ ఎకెజి ఇచ్చిన స్ఫూర్తితోనే!! ఇప్పటి ఎమ్మెల్యేలు కూడా ఎ.కె.గోపాలన్ పుస్తకం చదివితే బాగుంటుంది.

బొందిలో ప్రాణం పోయేవరకు పార్టీలోనే వుండి పోరాడతానని ఆనాడు ప్రమాణం చేశా. ఆ మాటలకు కట్టుబడే ఎన్ని కష్టాలెదురైనా, ఆర్థిక సమస్యలు పట్టి పీడించినా పని చేసినా. నాటి నుంచి నేటి వరకు జనాలకోసం...జనాల మధ్య వుంటూ పని చేస్తున్నా. రాజకీయ పోరాట జీవితపు రెండు దశల్లోనూ ఆ రెండు పుస్తకాలు నాకు స్ఫూర్తిగా నిలిచి నన్ను ముందుకు నడిపాయి.

★

చూద్దామా

# మారుతున్న ఆదివాసీ జీవితాలు

- ఎస్.వినయకుమార్

త్రిపుర రాష్ట్రంలోని ఆదివాసీల్లోనూ మార్పులు వస్తున్నాయి. వారి జీవన విధానం క్రమంగా మారుతోంది. తీవ్రవాదుల బెడద తొలగిన తర్వాత అభివృద్ధి క్రమం మరింత వేగం పుంజుకొంది. వృద్ధతరానికి, మధ్య తరానికి, యువతరానికి మధ్య తేడా కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. వివిధ ప్రభుత్వ పథకాల అమలు వారిలో అనేక మార్పులు తెస్తోంది. అగర్తలకు 20 కి.మీ దూరంలో ఉన్న బ్రజేంద్ర కాలనీ అనే గ్రామంలో సచిరాణి దేవ్‌బర్మా అనే ఆదివాసి మహిళను కలిశాం. వరి పొలంలో భర్తతో పాటు, పని చేసుకొంటున్న ఆమెను పిలిచి మాట్లాడాం. ఆమెకు ఒక ఎకరం పొలం ఉంది. వరి వేస్తారు. పొలం పని లేనప్పుడు అక్కడి రబ్బరు తోటల్లో పనిచేస్తారు. దానివల్ల భార్యాభర్తలకు రోజుకు రు.200 కూలీ వస్తుంది. ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. పిల్లలకు స్కూల్లో ఎలాంటి ఫీజులు లేవు. కాలేజీ చదువుల దాకా పుస్తకాలు, స్కూల్‌దుస్తులు కూడా ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుంది. అది కాకుండా స్టైఫండ్ లభిస్తుంది. ప్రభుత్వం ద్వారా బిపిఎల్ కింద ప్రభుత్వం నుండి నెలకు రు.20 కిలోల బియ్యం, కిలో రు.6 చొప్పున లభిస్తాయి. 'కుటుంబ రాబడి బాగానే ఉంది. పెద్దగా ఖర్చులుండవు. మిగిలిన డబ్బును ఏం చేస్తారు?' అని ప్రశ్నించాను. హైస్కూల్ లెవల్లో ఉన్న తమ మగపిల్లల్ని ఇంగ్లీషు మీడియం కళాశాలల్లో చదివించాలని అనుకొంటున్నట్లు సచిరాణి చెప్పింది. 'ఇంగ్లీషు బాగా వస్తేనే ఉద్యోగాలు వస్తాయి కదా' అని అంది. ఒక ఆదివాసీ మహిళ ఇలా మాట్లాడటం ఆశ్చర్యంగా అన్పించింది. నా పర్యటనలో గమనించిందేమిటంటే ఆదివాసీ మహిళలందరూ సిగ్గు పడకుండా నిబ్బరంగా మాట్లాడుతారు. మరి బాలికను ఎంత వరకు చదివిస్తారు... 'కనీసం మెట్రిక్ పాస్ కావాలి. అమ్మాయిని కాలేజీకి కూడా పంపాలని ఉంది. చూద్దాం. ఎలా ఉంటుందో' అంది. పిల్లల చదువు పట్ల ఆదివాసీలు పట్టుదలగా వుండడం నాకు కన్పించింది.

"అమ్మాయి చదువుకుంటే టీచర్ అయ్యే అవకాశం వుంది. అమ్మాయిని టీచర్‌గా చూడాలని వుంది" ఆ మాట అంటున్నప్పుడు సచిరాణి కళ్లలో మెరుపు కనిపించింది. ఆదివాసీల్లో వరకట్న సమస్య లేదు. పెళ్ళిలో సంసారానికి అవసరమైన మంచం, కంచం, చెంబు, గ్లాసు ల్లాంటివి ఇచ్చి పంపుతారు. పెళ్లికి చుట్టుపక్కల వారిని ప్రత్యేకంగా ఆహ్వానించనక్కర్లేదు. ఫలానా వాళ్లింట్లో పెళ్ళి జరుగుతోందని తెలిస్తే చాలు. చుట్టు పక్కలగ్రామాల నుండి ఆదివాసీలంతా వచ్చేస్తారు. వచ్చిన వారికి భోజనాలు పెట్టాల్సిందే. పెళ్లి ఖర్చు 15 వేల నుండి 25 వేల వరకు అవుతుంది. పెళ్లి చేసేవారు పలుకుబడి కల్గిన వారయితే డబ్బులున్న వారయితే లక్ష వరకు ఖర్చు వస్తుంటుందని మా పర్యటనలో ఒక ఆదివాసీ చెప్పాడు. అయితే అంత పెద్ద మొత్తంలో పెళ్లి కోసం ఖర్చు చేసే వారు చాలా అరుదని మిగతావారు చెప్పారు. ఉదయపూర్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు కూడా దీన్ని ధ్రువపరిచారు.

త్రిపుర రాష్ట్రంలోని జనాభాకు అంతటికీ దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న కుటుంబాలకు నెలకు 10 కిలోలు బియ్యం రు.6 చొప్పన, బిపిఎల్ కుటుంబాలకు నెలకు 20 కిలోల చొప్పున బియ్యం ఇస్తారు. మరీ పేదవారికి నెలకు 20కిలో అంత్యోదయ పథకం కింద లభిస్తుంది. వృద్ధులు, అనాథలు, వితంతువులు, విడాకులు పొందిన మహిళలకు అన్నపూర్ణ పథకం కింద నెలకు 10 కిలోలు ఉచితంగా లభిస్తాయి. తమకు ప్రభుత్వం నుండి బియ్యం లభించలేదని నా పర్యటన సందర్భంగా ఎవ్వరూ చెప్పలేదు. సబ్సిడీ బియ్యం సరఫరా వల్ల బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరగలేదు. నేను వెళ్లిన సమయంలో త్రిపుర కూడా వర్షాభావాన్ని ఎదుర్కొంటోంది. ఆ కారణంగా అక్కడ కూడా కూరగాయల ధరలు పెరిగాయి. కూరగాయల ధరలకు సంబంధించి మాత్రం నేను అగర్తలలో మాట్లాడుకోవడం విన్నాను.

### గోబర్ధి గ్రామం

అగర్తల నుండి మారుమూల ప్రాంతాల గుండా వెళ్తూ గోబర్ధి అనే గ్రామంలో ఆగాం. రోడ్డుపై ఉన్న సిపిఎం కార్యాలయానికి వెళ్లాం. ఎవరో జర్నలిస్టులు తమ గ్రామానికి వచ్చారని తెలిసి విలేజ్ కమిటీ అధ్యక్షుడు బిసుకుమార్ దేవ్‌బర్మా వచ్చి మమ్మల్ని కలిశాడు. మన గ్రామాలతో పోల్చితే అది అంత పెద్ద వూరు కాదు. ఆవూర్లో ఒక మార్కెట్ యార్డు, ఒక గ్రోత్ సెంటర్, పక్కా భవనంతో పెద్ద పాఠశాల (10+2) వున్నాయి. 762 మంది బాలబాలికలు ఆ పాఠశాలలో చదువుకొంటున్నారు. పాఠశాలకు చక్కటి ప్లే గ్రౌండ్ ఉంది. తమ గ్రామంలో అన్ని సౌకర్యాలున్నాయని, అయితే పాఠశాలలో టీచర్ల కొరత ఉందని గ్రామస్తులు చెప్పారు. గతంలో ఆ గ్రామంలో బ్యాంకు కూడా వుండేది. తీవ్రవాదుల కారణంగా బ్యాంకును అక్కడి నుండి తరలించారు. బ్యాంకు లేకపోవడం వల్ల తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బ్యాంకును మళ్లీ ఏర్పాటు చేస్తే బావుండేదని బిసుకుమార్ అన్నారు. తీవ్రవాదుల వల్ల తమ అభివృద్ధి చాలాచోట్ల

ఆగిపోయిందన్న అభిప్రాయాన్ని నా పర్యటనలో ఆదివాసీలు చాలామంది వ్యక్తం చేశారు.

గోమర్ధి గ్రామాన్ని సందర్శించినప్పుడు అక్కడ వృద్ధులకు వృద్ధాప్య పించన్లు ఇస్తున్నారు. ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల కుగ్రామాల్లోని వారు కూడా అక్కడికి వచ్చి పించన్లు తీసుకుంటారు. 65ఏళ్లు దాటిన వారికి, భర్త వదిలి పెట్టడం వల్ల అనాధలైన మహిళలకు నెలకు 400రూపాయల పించను లభిస్తుంది. అధికారులు నెలలో నిర్ధిష్ట పరిచిన రోజున గ్రామానికి వచ్చి డబ్బు పంపిణీ చేసి వెళ్తారు. తమకు ప్రతినెలా పించను అందుతుందని పించనుదార్లు చెప్పారు. పించనుకు ఎవరు అర్హులో గ్రామసభ నిర్ణయిస్తుంది. రాజకీయ నాయకుల సిఫారసులు వుండవు. అధికారులు ఆ గ్రామానికి చెందిన ఇద్దరు పెద్ద మనుషుల సమక్షంలో పేర్లు పిలిచి పించను పంపిణీ చేస్తారు. మేము వెళ్లినప్పుడు అధికారులతో పాటు ఇద్దరు ఆదివాసీలు కూర్చుని పించను బట్వాడాను పర్యవేక్షిస్తున్నారు. ఆ ఇద్దరిలో ఒకరు మహిళ. ఆ గ్రామం వెలుపల మాకు ఐరన్ రిమూవర్ ప్లాంట్ కనిపించింది. ఆదివాసీ ప్రాంతాల్లోని భూగర్భనీటిలో ఇనుము ఎక్కువగా వుంటుంది. దానిని తొలగించి నీటిని తాగటానికి సరఫరా చేస్తారు. ఆదివాసీ ప్రాంతాల్లో అనేక చోట్ల ఐరన్ రిమూవర్ ప్లాంట్లు కన్పిస్తాయి.

### రబ్బరు వ్యవసాయం

రబ్బరు వ్యవసాయం పై త్రిపుర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. క్రమంగా అక్కడ రబ్బరు చెట్ల పెంపకం పెరుగుతోంది. ఇప్పటికి ప్రభుత్వం 35 వేల కుటుంబాలకు రబ్బరు చెట్ల పెంపకం కోసం కుటుంబానికి 2 ఎకరాల భూమి చొప్పున కేటాయించింది. ప్రభుత్వం మొక్కలు నాటడానికి అవసరమైన తోడ్పాటునందిస్తుంది. మొక్కలు పెరిగి చెట్లయి లాటెక్స్ (రబ్బరు ద్రావకం)ను తీసుకోవడానికి ఏడేళ్లు పడ్తుంది. ఈ ఏడేళ్లు రబ్బరు చెట్లను జాగ్రత్తగా చూసుకొన్నందుకు ప్రభుత్వం లబ్ధిదారులకు కూలీ చెల్లిస్తుంది. ఏడేళ్ల తర్వాత ఆ చెట్లను వారికే అప్పగిస్తుంది. లాటెక్స్ వల్ల ఏడాదికి లక్ష రూపాయల నుండి రెండు లక్షల వరకు లబ్ధిదారులకు ఆదాయం లభిస్తుంది. ఈ పథకాన్ని మరింతగా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి పథకంలోనూ లబ్ధిదారులను భాగస్వాములను చేయడం త్రిపుర ప్రభుత్వ విధానం.

రబ్బర్ సేద్యం క్రమంగా ఆదివాసీల్లో చాలా మార్పులు తీసుకొస్తున్నట్లు కన్పిస్తుంది. బీర్ చంద్ర మను అనే ఒక చిన్న పట్టణానికి సమీపంలోని తుయికర్మ గ్రామంలోని అనిల్ రియాంగ్ అనే ఆదివాసీ ఇంటిని నేను సందర్శించాను. అతనికి వున్న భూమిలో రబ్బరు చెట్లు వేశారు. నెలకు రు 6 వేలు ఆదాయం వస్తుంది. విశాలమైన స్థలంలో ఆయన టాంగ్‌హట్ ఇల్లు ఉంది. ప్రభుత్వం ఆయనకు ఒక ఎకరం భూమి ఇచ్చింది. వ్యవసాయంతో పాటు పందులు పెంచుతున్నాడు. కోళ్లు, బాతులు సరేసరి. భార్యాభర్తలు ఇద్దరూ ఎంతో సంతోషంగా మాతో మాట్లాడారు. తమ అబ్బాయి ఇంగ్లీష్ హానర్స్‌లో ఎం.ఏ చేశాడని, అతనికి అగర్తల ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రిలో కంప్యూటర్ విభాగంలో ఉద్యోగం దొరికిందని అనిల్ రియాంగ్ దంపతులు గర్వంగా చెప్పారు. "మీకు చాలా ఆదాయం వస్తుంది కదా. ఏం చేస్తారని" ప్రశ్నించాను. "మా అబ్బాయిని అగర్తలలోని ప్రయివేటు హోలిక్రాస్ స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చదివించాను. మరో ఇద్దరు అమ్మయిలున్నారు. వారినీ ఇంగ్లీషు

## హోజగిరి నృత్యం

రియాంగ్ తెగవారు చేసే నృత్యం ఇది. వీరిది ప్రధానంగా పోడు వ్యవసాయం. పంటలు ఇంటికి వచ్చేకాలంలో లక్ష్మీ పూజ రోజున ఈ నృత్యం చేస్తారు. ఆకర్షణీయంగా ఉండే ఈ నృత్యాన్ని ఇతర ప్రాంతాల వారు తిలకించే అవకాశాన్ని కల్పించడంతో పాటు ఆ నృత్యరీతిని సంరక్షించేందుకు త్రిపుర ప్రభుత్వం తుయికర్మ గ్రామంలో ఒక అకాడమీని ఏర్పాటు చేసింది. నృత్యం నేర్చుకొనేందుకు ఓపెన్ ఎయిర్ థియేటర్లో ప్రదర్శించేందుకు అక్కడ ఏర్పాట్లున్నాయి. హోజగిరి నృత్య ప్రదర్శనకు గాను రాష్ట్రపతి అవార్డు పొందిన సత్యరామ్ రియాంగ్ (65) అక్కడ శిక్షణ ఇస్తుంటారు. 35 మంది శిక్షణ పొందుతున్నారు. ఆయన శిష్యురాళ్లలో ఒకరైన సాజంతి రియాంగ్ మాకు నృత్యం ప్రదర్శించి చూపెట్టింది. ఆమె తన బృందంతో రష్యా, నేపాల్, జపాన్ దేశాలను సందర్శించారు. మన దేశంలోనూ వివిధ ప్రాంతాల్లో పర్యటించారు.

మీడియంలో చదివించాలి. ప్రయివేట్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో వాళ్ళ చదువులకు, పట్టణంలో ఉండి చదివేందుకు ఏడాదికి రు.లక్ష అయినా ఖర్చువుతోంది కదా" అంటూ ఎదురు ప్రశ్న వేశారు. ఇంగ్లీషు చదివితేనే ఉద్యోగాలొస్తాయి లేకుంటే లేదు అనే అభిప్రాయం ఆదివాసీల్లో బలంగా ఉండటం కొంత ఆశ్చర్యం కల్గిస్తుంది. రబ్బరు వ్యవసాయం ఆ కుటుంబంలో చాలా మార్పు తెచ్చింది. ఆ గ్రామంలో కొందరు ఆదివాసిల ఇళ్లముందు కూడా మాకు కారు, మోటర్‌సైకిళ్లు కన్పించాయి. బహుశా రబ్బరు సేద్యం ప్రభావం కావచ్చు. తమ రబ్బరు చెట్లనుండి సేకరించిన రబ్బరు ద్రావకాన్ని రైతులు సహకార సొసైటీకి పోస్తారు. అక్కడ ద్రావకాన్ని ప్రాసెస్ చేసి తెల్లటి రబ్బరు షీట్లను తయారు చేసి పైకి పంపుతారు. మధ్యవర్తుల దోపిడీ లేదు కనుక రబ్బరు రైతుకు న్యాయమైన ధర లభిస్తుంది.

### ఆరోగ్యం

త్రిపుర ఆదివాసీల్లో కొట్టొచ్చినట్టు కన్పించే మరో అంశం వారి ఆరోగ్యం. ఈసురోమంటూ వుండేవారెవరూ వారిలో కన్పించరు. రక్తహీనత ఉండదట. మూడు పూటలా అన్నం తింటారు. చాలా వరకు మాంసమే వారికి అనుపానం. గబోర్ది గ్రామ కమిటీ అధ్యక్షుడు బిసుకుమార్ దేవ్‌బర్మ నాకు వారి ఆహారపు అలవాట్ల గురించి చెప్పారు. "మాకు మనిషికి రోజుకు కనీసం ఒక కిలో బియ్యం కావాలి. అంతకంటే ఎక్కువ తినేవారు కూడా ఉంటారు. వారంలో ఎక్కువ రోజులు మాంసాహారంతోనే భోజనం. మాకు పప్పు అస్సలు పడదు. కూరగాయలు తింటుంటాం. మాంసంలో మేము ఎక్కువ ఇష్టపడేది పందిమాంసం. ధర కిలో రు.150. అరకిలోకు తక్కువ కొనం. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ బియ్యం అందుతాయి. మాంసాహారం వల్ల మాకు అయ్యే ఖర్చు ఎక్కువే. అయినప్పటికీ కొంత డబ్బు మిగుల్తుంది. దాన్ని బ్యాంకులో దాచుకొనే వాళ్లం. ఉగ్రవాదుల కారణంగా బ్యాంకును మా గ్రామం నుండి ఎత్తేశారు. డబ్బు దాచుకోవాలంటే చాలాదూరం వెళ్లాల్సి వస్తుంది" అని చెప్పాడు. "బెంగాలీలు చేపలను ఇష్టంగా తింటారు. ప్రతిపూట చేపముక్క ఒకటి ఉండాల్సిందే. ఆదివాసీలకు పందిమాంసమే ఎక్కువ ఇష్టం. మీ మాదిరిగా పప్పు గిప్పూ మా కిష్టముండదు" అంటూ ఓ ఆదివాసీ చెప్పాడు. మాంసాహారం రెగ్యులర్‌గా తినడం వల్ల ఆదివాసీల్లో రక్తహీనత ఉండదు. శారీరక కష్టం వల్ల కండలు తేలి ఉంటారు. ఇదే విషయాన్ని ఎస్పీ శ్రీనివాసరావు చెప్తూ "ఆదివాసీలు చాలా సౌష్టవంతో ఉంటారు, త్రిపురలో పేదవారికి గీటురాయి వేరు. మన రాష్ట్రంలో అయితే పచ్చడి మెతుకులు కూడా నోచుకోని వారు పేదవాడి కింద లెక్క. ఇక్కడ భోజనంలో చేపముక్కకో, మాంసం ముక్కకో నోచుకోని వాడు పేదవాడు" అని చెప్పారు. ఆయన మాట కాస్త అతిశయోక్తి అనిపించినా అది నిజం. త్రిపుర బెంగాలీలు చేపలతో పాటు పందిమాంసాన్ని కూడా బాగానే ఇష్టపడ్తారు. అగర్తలలో పందిమాంసం ధర కిలో190రూపాయలు. చికెన్ ధర 110రూపాయల వరకు వుంటుందని చెప్పారు. మేక మాంసం చాలా ప్రియం. కిలో 390రూపాయలు. పశుమాంసం తినేవారి సంఖ్య త్రిపురలో చాలా తక్కువ.

ఉదయపూర్ పట్టణానికి 10 కి.మీ దూరంలో ఉన్న మహారథి గ్రామంలో ప్రాథమిక వైద్య కేంద్రంలో పని చేస్తున్న డాక్టర్ డి. దాస్‌తో మాట్లాడినప్పుడు ఆయన కూడా ఇదే విషయం చెప్పారు. ఆయన అంతకు ముందు రోజు ఔట్ పేషెంట్ రిజిస్టర్ తీసి, "నిన్న 54 కేసులు రాగా అందులో ఒకటి డిసెంట్రీ కేసు, మిగతావన్నీ మలేరియా కేసులు" అని తెలిపారు. ఆదివాసీల్లో రక్తహీనత కేసులు తక్కువ. రోగనిరోధక శక్తి కూడా బాగానే ఉంటుందని డాక్టర్ అన్నారు. తమకు మలేరియా అన్నదే పెద్ద సమస్య, మలేరియా తర్వాత గ్యాస్ట్రిక్స్ సమస్య రెండవ స్థానంలో ఉంటుందన్నారు. బురదనేలలు, ఒకపట్టాన తడి ఆరవు, నీళ్ల ఇంకవు. చెట్టూ చేమా ఎక్కువ మరి. త్రిపుర భోజనంలో ఉప్పుకారం చాలా తక్కువ. భోజనంలో పచ్చిమిరపకాయ, నిమ్మ దబ్బ, ఉప్పు విడిగా వడ్డిస్తారు. అవసరమయిన వారు వాటిని ఉపయోగించవచ్చు. లేదంటే లేదు. ఏప్రిల్ సెప్టెంబర్‌ల మధ్య తమకు రోగుల సంఖ్య ఎక్కువ అన్నారు. గ్రామాల్లోనూ, రక్షిత మంచినీరు లేదా బోరు సౌకర్యం ఉన్నప్పటికీ ఆదివాసీలు బోరు నీటి కంటే గుట్టల మీద నుండి పారే వాగులు వంకల నీటినే తాగడానికి ఇష్టపడతారు. "బోరు ఉంది కదా ఆ నీటిని ఎందుకు తాగరు?" అని ఒక ఆదివాసీని ప్రశ్నించగా, బోరునీటిలా కాకుండా వాగుల్లో నీరు రుచిగా ఉంటుందని వరంగ్ పారా అనేగ్రామవాసి రియాంగ్ అనే 70 ఏళ్ల మహిళ చెప్పింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సరిపోయినంత సంఖ్యలో వున్నారు. ఇద్దరు డాక్టర్లు ఆర్గురు స్టాఫ్‌నర్సులు, ఎనిమిది మంది జనరల్ డ్యూటీ అటెండెంట్స్, ముగ్గురు పారిశుద్ధ కార్మికులు ఉన్నారని డాక్టర్ డి దాస్ చెప్పారు. ఆ కేంద్రంలో ఆరు పడకలున్నాయి. తాము ఆదివాసీలకు యాంటీ హెల్మెటిక్, యాంటీ వైరస్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాళ్ళ గ్రామాలకు వెళ్లి అందచేస్తుంటామని తెలిపారు. ప్రజలు నీటిని కాసివడబోసి తాగితే ఆదివాసీలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు చాలా వరకు తీరిపోతాయని చెప్పారు.

**మరిన్ని విశేషాలు పైవారం**

# బంగాళ దుంపల పులుసు

**కావలసిన వస్తువులు**

బంగాళదుంపలు - 1/2 కిలో,
ఉల్లిపాయలు - 1/4 కిలో, పచ్చి మిరపకాయలు -4,
నూనె - 50 గ్రాములు,
చింతపండు - చిన్న కమాలా పండంత,
కారం - టేబుల్ స్పూనున్నర, ఉప్పు - తగినంత ,
బెల్లం- తగినంత, మెంతులు - టేబుల్ స్పూన్,
పోపు సామాను -కరివేపాకు,
వెల్లి గర్భాలు- రెండు.

**తయారు చేసే విధానం**

ముందు చింతపండు కడిగి నానపెట్టుకోవాలి. బంగాళదుంపలు, ఉల్లిపాయ పొట్టు తీసి చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. పచ్చి మిరపకాయలు చీలికలుగా గాని, సగానికి గాని కోసిపెట్టుకోవాలి. గిన్నె శుభ్రముగా కడిగ పొయ్యిమీద పెట్టి తడిపోయిన తరువాత నూనెవేసి, వెల్లి చిదిమేసి మెంతులు వేయాలి. తరువాత పోపు సామాను, కరివేపాకు వేసి, ఉల్లి, మిర్చి, దుంప ముక్కలను కూడా వేసి కాస్త వేగనివ్వాలి. తరువాత కారం, చింతపండు పులుసు చిక్కగా పిండి వేసుకోవాలి. బెల్లం కావలసిన వారు వేసుకోవచ్చు లేని వారు లేదు. ఈ పులుసు చిక్కగా మరగ పెట్టుకోవాలి. ఇది ముద్దపప్పుతో కలిపి తింటే బాగుంటుంది.



# కంద అట్టు

**కావలసిన వస్తువులు**

కంద -1/2 కిలో, పెసరపప్పు -పావుకిలో ,
పెద్ద ఉల్లిపాయలు - రెండు, యెండు
మిరపకాయలు - నాలుగు, పచ్చిమిర్చి
-నాలుగు, అల్లం - 1 అంగుళం ముక్క,
ఉప్పు -తగినంత.

**తయారుచేసే విధానం**

కంద పొట్టు తీసుకొని సన్నగా ముక్కలుచేసి కడిగి పక్కనపెట్టుకోవాలి. పెసరపప్పు నానపెట్టుకోవాలి. పప్పు నానిన తరువాత కడిగి, కంద ముక్కలు, పప్పు, మిరపకాయలు, ఉల్లి అల్లం అన్ని కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. ఉప్పు కూడా వేసి రుబ్బు కోవాలి. దీని అట్టు పిండి లాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. తర్వాత దోసలమాదిరిగా పోసుకోవాలంతే.




# అవిశాకు కూర

**కావలసిన వస్తువులు**

అవిశాకు - లేతది కొంచెం,
పచ్చికొబ్బరి - 1 చిప్ప,
పెద్దఉల్లిపాయ - ఒకటి,
పచ్చిమిర్చి - కారం సరిపడా,
అల్లం -1/2 అంగుళం ముక్క,
ఉప్పు - తగినంత, నూనె -
చిన్న గిన్నెడు.

**తయారు చేసే విధానము**

అవిశాకు పుల్లలు లేకుండా తీసి శుభ్రంగా కడిగి నీళ్ల లేకుండా తుడవాలి. తర్వాత దీన్ని సన్నగా తరిగి నీళ్లుపోసి రెండు, మూడుసార్లు బాగా కడగాలి. ఆకుపచ్చ నీళ్ళు వస్తాయి. అవి పోయాక నీళ్ళన్నీ వంచేయాలి. తరువాత దీనిని ముందు చెప్పిన ములగాకు కూరలాగానే చేసుకోవాలి. దీనిని కూడా పెసరపప్పుతో వండుకోవచ్చు.

# ములగాకు కూర

**కావలసిన వస్తువులు**

ములగాకు - కాస్త
కొబ్బరి -చిన్న చిప్ప (పచ్చిది)
పెద్ద ఉల్లిపాయ -1
పచ్చిమిర్చి -4
అల్లంముక్క - అంగుళం
పోపు సామాను - కరివేపాకు

**తయారు చేసే విధానం**

ములగాకును పుల్లలు లేకుండా (లేతాకు) ఆకు మాత్రమే గిల్లి పెట్టుకోవాలి. కొబ్బరి కోరిపెట్టుకోవాలి. ఉల్లిపాయ, అల్లం, మిర్చి సన్నగా తరిగి పెట్టుకోవాలి. బాండీలో నూనెవేసి కాగిన తరువాత పోపు వేసి కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసుకోవాలి. ఇవి కొంచెం వేగిన తరువాత ములగాకు వేసి కాస్త వేగనివ్వాలి. తరువాత అల్లం, మిర్చి ముక్కలు, కొబ్బరి కోరి వేసుకోవాలి. ఇవి కలియ తిప్పాలి. తర్వాత ఉప్పు కూడా వేసి ఒక్క చుక్క నీళ్లచల్లి మూత పెట్టాలి. దీన్ని ఒక్క నిమిషమాగి కూర బాగా కలియబెడుతూ వేయించుకోవాలి. కొబ్బరి బదులు పెసరపప్పు కూడా నానబెట్టి వేసుకోవచ్చు.

★

సీరియల్

# గని

***జరిగినకథ:***

పెద్దవాళ్ల మాటల్ని విన్న మునిలాల్ కుమారుడి చిట్టి బుర్రలో అనేక సందేహాలు ఉదయిస్తాయి. ఉద్యమం అంటే ఏంటి? శ్రమకు తగ్గ ప్రతిఫలం ఇవ్వడమంటే ఏంటి? ఉద్యమం చేస్తే యాజమాన్యం కాల్చకుండా చూస్తూ ఊరుకుంటుందా? అటువంటప్పుడు ఉద్యమం ఎలా కొనసాగుతుంది? ఎవరు గెలుస్తారు? మనం గెలిస్తే మనకు మంచి తిండి, బట్ట దొరుకుతాయా? వంటివే అటూ ఇటూగా అడుగుతాడు. వాటికి తండ్రి సమాధానాలు చెప్తాడు. మరోవైపు చంచల్ కుమార్ కుమార్తెకు జ్వరం వస్తుంది. ఆమెకు ఎవరైనా చేతబడి చేశారేమోనన్నది వారి అనుమానం. లేకపోతే శివకుమారి ఏదైనా అపరాధం చేసి దైవానికి ఆగ్రహం కలిగించిందేమోనని శంక. అన్నీ పేదరికంలోంచి పుట్టిన అనుమానాలే. ఇంకోవైపు గని యాజమాన్యానికి తమ భూముల్ని అప్పచెప్పిన రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తాడు బికాస్. ఆ తర్వాత....

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(ఇరవై నాలుగవ భాగం)

**త**డి పెదాలు, కాస్త చప్పిడిముక్కు, పాలిపోయిన మొహం, పొట్టిగా కనిపించే వేళ్ళు.. వెరసి సాహు. "అడవి నుంచి రావడానికి ఆలస్యమైంది. మీకు పనిగంటలంటూ ఉన్నాయి. సైరన్ వినగానే లోపలికి వెళ్ళడం, రావడం... మాకు అలా కాదు కదా! పనికి అంతంటూ ఉండదు. తీరా ఇక వెళదామనుకొని బయలుదేరబోతుండగా మేక ఒక తట్టు పరుగెడుతుంది. ఆవు మరో వంక పరుగెడుతుంది. పొద్దు గూకింది కదాని వదిలేసి రాలేం కదా! మాపనికి మీరు ముందే వచ్చి కూచున్నారు" అన్నాడు క్షమాపణ కోరుతోన్న ధోరణిలో.

వర్షాకాల సూర్యుడిలా ప్రకాశిస్తోన్న బికాస్ చిరునవ్వు మొగంతో "శ్రమజీవుల జీవితాలు మందకొడిగానూ, కష్టభరతంగానూ ఉంటాయి. అందునా రైతన్నల బతుకులు..." అన్నాడు. అంతలో తనతో తాను సంభాషిస్తున్నట్టు ఆలోచనా సముద్రంలో మునిగిపోయాడు.

శ్రమజీవుల జీవితాల్లో ఎంత వేదన! ఎంత చీకటి! కళ్ళెదుటే ఎన్నో అక్రమాలు జరుగుతున్నా ఎదిరించడానికి ధైర్యం చాలదు. ఎదిరించి నెగ్గగలమన్న నమ్మకమూ ఉండదు. రోజువారీ సమస్యలు చికాకు కలిగిస్తాయి. కడుపు మంటలోంచి పోటీతత్వం, అసూయా పుట్టుకొచ్చి రోజువారీ సమస్యలు చికాకు కలిగిస్తాయి. తన చుట్టూ ఉన్న వ్యక్తులతో తగాదా పెట్టుకోవడానికీ, ప్రాణాలు తీసేంత కోపాన్ని, ఉన్మాదాన్ని కలిగిస్తాయి. తమ బాధలకు మూలకారణం ఏదో తెలుసు కోకుండా, తెలిసినా తమ శక్తియుక్తుల్ని 'నుదుటిరాత' మరుగున పడేసి, బానిసత్వ భావజాలంలో మగ్గిపోతున్నారు.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "అవునన్నా! నువ్వు చెబుతున్నది నూటికి నూరుపాళ్ళు నిజం. దేన్ని చూసినా భయం, ఏ మాట విన్నా సందేహం. భోగభాగ్యాలు లభించకపోయినా ఫరవాలేదు గానీ, ఉన్నది కాస్తా పొగొట్టుకోకూడదన్న తపన... మీరొచ్చినా, మాకు సరైన అవగాహన కలగలేదు" అన్నాడు. ఆత్మవిమర్శ చేసుకొంటున్నట్టు.

చీకటి చిక్కబడే కొద్దీ జనం ఒక్కొక్కరే వచ్చి చేరుతున్నారు. కసవు పరిచిన పశువుల కొట్టం సాహుది. ప్రతి ఒక్కరూ లాంతరు తీసుకొచ్చారు. కొట్టం మధ్యలో ఓ చిన్న బల్లపైన దీపం వెలుగుతోంది. అందువల్ల వచ్చిన వాళ్ళంతా తమ లాంతర్లను ఆర్పేశారు. ఆరిపోయిన వొత్తుల్లోంచి కిరసనాయిలు వాసనతో కూడిన పొగ బయలుదేరి కొట్టంలో సుళ్ళు తిరుగుతోంది. ఆ వాసనా, పొగా, వెగటు పుట్టిస్తున్నాయి.

పరిచయాలయ్యాక "సూటిగా విషయంలోకి వద్దాం. రేపు మేం పనిలోకి వెళ్ళాలంటే, ఇవ్వాళ కాసేపు నడుం వాల్చాలి కదా!" అన్నాడు దిలీప్.

"సరే, చెప్పండి" అన్నాడు ఓ పెద్దాయన, ఆమోద సూచకంగా తల ఊపుతూ.

గని కార్మికుల్లో కొందరు రైతులు కూడా ఉన్నారు. వాళ్ళు కూడా సమావేశానికి వచ్చారు. గని యాజమాన్యం తీసేసుకున్న భూముల్లో ప్రస్తుతం మనం ఆవులు మేపుకుంటున్నాం. సేద్యం కూడా చేసుకోవచ్చని యాజమాన్యం వారు సెలవిచ్చారు. వాళ్ళిచ్చే డబ్బు తీసుకొని ఈ సదుపాయాలు అనుభవించ గలిగితే అదే పదివేలు" అనుకుంటున్నారు భూములు ఇచ్చిన రైతులు. ఇది గ్రహించిన బికాస్ "మీ భూముల్ని గని యాజమాన్యానికి ధారాదత్తం చేసినా ప్రభుత్వం వాళ్ళ దగ్గర్నుంచి మీకు నష్ట పరిహారం ఇప్పించలేదు. భూములు ఇచ్చిన వాళ్ళందరికీ ఉద్యోగం వేయించలేదు. మీరు సంఘం పెట్టుకొని, కలసికట్టుగా విజ్ఞప్తి చేస్తే తప్ప కొద్దిపాటి నష్టపరిహారమైనా దక్కదు" అన్నాడు నెమ్మదిగానూ సౌమ్యంగానూ.

"మనం ఎక్కువ నష్టపరిహారం, ఉద్యోగం అంటూ మొదలుపెడితే వాళ్ళు ఇవ్వదలుచుకొన్న డబ్బు, సదుపాయాలూ ఇవ్వకుండా పోతే మనమేం చేయగలం? మొదటికే మోసం వస్తే.. మీలో ఉన్నంత ఐకమత్యం రైతుల మధ్యా వస్తుందనుకొంటున్నారా? ఈ సమావేశాన్నే తీసుకొండి. ఇక్కడ నివసించే గని కార్మికుల బలవంతం మీద మేం వచ్చాం. ఎక్కువ మంది మనకెందుకీ గొడవ, భూమికి బదులుగా డబ్బు నేడు కాకపోతే రేపయినా వస్తుంది. తొందరేముంది. అనుకొని ఇళ్ళలోనే ఉండిపోయారన్న సంగతి మీకు తెలుసా?" అన్నాడొక రైతు, చాచిన కాళ్ళ మధ్య కంగారులా చేతులుంచుకొని.

మనసులోపలి భయాన్ని సూచిస్తోన్న అతడి మాటలు బికాస్‌ను ఆలోచింపజేశాయి. 'భారత ప్రజల హృదయాలు చాలా సంక్లిష్టమైనవి. మతం,

జాతి, కులం అంటూ అనేకానేక వైరుధ్యాల పుట్టి మన సమాజం. వేలవేల సంవత్సరాలుగా భూస్వామ్యవ్యవస్థ రెక్కల కింద బానిసత్వం అనుభవిస్తోన్న గ్రామీణ సమాజం దెయ్యాలు, భూతాలు, మాంత్రికులు, చేతబడి అంటూ ఎన్నో అంధవిశ్వాసాలు రాజ్యమేలుతున్నాయి. భిన్నమైన భావజాలాన్ని త్వరగా స్వీకరిస్తారని ఆశించలేం' అనుకొన్నాడు బికాస్.

"కార్మికుల మధ్య ఐక్యత మాత్రం అంత తేలిగ్గా సాధ్యపడిందా? సంఘం ఏర్పాటు చేసుకోవడానికి ఎన్ని ఆటుపోట్లను ఎదుర్కొన్నామో మీకు తెలియంది కాదు కదా! పురుటి నెప్పులు లేకుండా కానుపవుతుందా? విజయాన్ని చవిచూడాలంటే, అంతకు ముందెంతో వేదన అనుభవించాల్సి ఉంటుంది.

'మనం యజమానుల్ని ఎదిరించి, చావు దెబ్బలు తినాలని ఆశిస్తున్నాడా ఇతగాడు? బాధలు అనుభవించాలని కోరుకొంటున్నాడా? భూములు కోల్పోయిన బాధకు తోడుగా ఉద్యమం, జైళ్ళూ కావాలా మనకు?' అనుకున్నారు రైతులు. వాళ్ళ ముఖాల్లో భయం నీడలు కమ్ముకున్నాయి.

సాయంత్రం కురిసిన వానకు రొచ్చులా తయారయిన పల్లె మట్టి వాసనేస్తోంది. గ్రామమంతటా ప్రసరిస్తోన్న మూడోజాము చంద్రుడి నిదుర మొగపు సన్నని వెలుతురు, నివురు గప్పిన నిప్పులా చీకటి చాటున దాగి ఉంది. వాళ్ళ భావాల్ని గ్రహించిన వాడల్లే "మీ భయం నాకు అర్థం మవుతోంది. నోరు మెదపకుండా ఉంటే నష్ట పరిహారం మీకు దక్కదు. భయం అడవిచిచ్చు లాంటిది. మనోస్థైర్యం లేని వాళ్ళను ఇట్టే లొంగతీసుకొంటుంది. అది ఆత్మవిశ్వాసాన్ని పరీక్షిస్తుంది. అందులో నెగ్గిన వాళ్ళు మాత్రమే జీవన సౌందర్యాన్ని ఆస్వాదించగలుతారు. ఓడిపోయిన వాడు చతికిలబడిపోతాడు" అన్నాడు బికాస్. మామూలు కంటె భిన్నంగా, బావిగిలక చప్పుడులా కీచుమని పలికింది బికాస్ గొంతు.

"దేవుడు దయతలిస్తే అన్నీ జరుగుతాయి. ఆయన తోడులేకుంటే ఏ పనీ జరగదు. వేచి చూద్దాం. అందని దానికి అర్రులు చాచి, ఉన్నది కాస్తా ఊడగొట్టుకోలేం కదా?" అన్నాడు కోలమొహం, చప్పిడి ముక్క, పీక్కుపోయిన కళ్ళతో ఓ రైతు డీలాపడ్డ మనసుతో.

అజ్ఞానం లోంచి పుట్టుకొచ్చే భయం వ్యక్తిని బలహీనపరుస్తుందని అనుకొని బాధపడ్డ బికాస్ "పేదవాళ్ళు దురదృష్టవంతులు. భగవంతుడు వాళ్ళపై కరుణామృత వర్షం కురిపించడు. వాళ్ళు గంజితాగి కడుపు నింపుకొంటారు. బలవర్ధకమైన రొట్టెలూ, కూరగాయిలూ వాళ్ళకు అందనివి. ఏడవడానికయినా కన్నీళ్ళుండవు... మీకన్నీళ్ళ గురించి పట్టించుకొనేంత తీరిక భగవంతుడికి ఉందా? డబ్బూ, దాబూ ఉన్నవాళ్ళు చేసే ఆడంబరమైన పూజలందుకొంటూ వాళ్ళను సదా కాపాడుతూ ఉంటాడామో!" కోపంతోనూ, అసంతృప్తితోనూ ఊగిపోతూ చెప్పాడు.

బికాస్ చేసిన దైవదూషణతో ఎవరూ ఏకీభవిచలేదు. గానీ, అతడి మాటల్లో కొంత నిజం ఉందని కొంతమంది రైతులు భావించారు. తమ కష్టాలు తొలగిపోవడం కోసం వాళ్ళు మొక్కని దైవం లేదు. చేయని ప్రార్థనలేదు. దైవం పలకలేదు. గానీ, దైవం తరపున పూజారులే జవాబు చెబుతారు. పరిష్కారం కనిపించని జీవన సమస్యలకూ, తప్పనిసరి పరిస్థితుల్లో చేసే తప్పిదాలకూ దేవుడి మీద భారం మోపుతారు. గతజన్మలో పాపాలు వెంబడిస్తుంటే తాము చేయగలిగింది మాత్రం ఏముందిలేమ్మన్న క్రియాశూన్యత. కొన్ని సందర్భాల్లో దుర్భర పరిస్థితులు పాపపుణ్య చింతననూ, సాంప్రదాయం ఏర్పచిన నమ్మకాలనూ విసిరికొట్టేంత ధైర్య కల్పిస్తాయి. అలా పైకొచ్చిన వాళ్ళు మాత్రమే సామాజిక చలనాలనూ, మార్పు తాలూకు కార్యక్రమాలూ నిర్వహ్చిగలుగుతారు. తమ సమస్యల పరిష్కారం కోసం తమంతట తాము వచ్చి ఉద్యమంలో చేరడం వల్ల కుదిరన నమ్మకమూ, ధైర్యమూ సామాజిక సమస్యల్ని ఎదుర్కొనే మనోస్థైర్యాన్ని ఇచ్చింది. దుర్భర వేదనలోకి తోసే స్వీయ జీవితానుభవాలే వాళ్ళకు పాఠాలు. మనుషుల మనస్సుతో గూడుకట్టుకొన్న చీకట్ని పారతోలే సాధనం అనుభవమే!

"ఇది మా సమస్య. ఇందులో మీ కెందుకింత అక్కర" అన్నాడొకడు నక్క ఊళలాంటి స్వరంతో.

కార్మికులకూ, రైతులకూ 'ఇతడెందుకిలా అడుగుతున్నాడు' అనే సందేహం వచ్చింది. యాజమాన్యం తాలూకు మనిషేమో అనుకున్నారు. కార్మికుల ఐక్యతను భగ్నం చేసే ఉద్దేశ్యంతో కొందరికి ప్రత్యేక సదుపాయాలు కల్పించడం, అక్కడక్కడా తమ మనుషుల్ని నియమించుకోవడం వంటివి యాజమాన్యానికి కొత్తేమీ కాదు. అదే పాచికనే ఇప్పుడూ ప్రయోగిస్తోందేమో!

మరో రైతు "రేయ్! ఈ గనివాళ్ళు నీ కెంత ధనసహాయం చేశారు? నువ్వూ కూడా భూమి కోల్పోయిన వాడివే కదా! ఉద్యమానికి రాకుంటే ఊరికే ఉండడం ఉత్తమం. ఏమంటావు?" అన్నాడు విసుగూ కోపమూ కలగలిసిన స్వరంతో.

చింపిరి చొక్కా తలపాగా ధరించిన వృద్ధుడు "అతడి గురించి ఊరందరికీ తెలిసిందే కదా. డబ్బు కోసం నానాగడ్డీ గతికే వెధవ. వాడి మాటలకేంగానీ..." అన్నాడు. మంచి పనిని భగ్నం చేయడానికి వచ్చినట్టున్నాడన్న కోపంతో.

వాళ్ళు ఏవేవో మాట్లాడుకొన్నారు. మాట్లాడి మాట్లాడి అలసిపోయిన కొందరు కూచున్న పళంగా తలలు ఓ పక్కకు వాల్చి నిద్రకు ఉపక్రమించారు. దీన్ని గమనించి కొందరు పిల్లలు చప్పట్లు కొట్టడంతో, మాటలతో వేడెక్కిన వాతావరణం కాస్తా చల్లబడింది.

నమ్మకమూ, అపనమ్మకమూ పాశ్రితమైన రైతులు మనోభావాల్ని అర్థం చేసుకొన్నాడు బికాస్. ఇది వీళ్ళు కావాలని చేయడం లేదు. ధనవంతుల అజమాయిషీతో అణగిమణగి ఉండే జీవితాలు, అనూచానంగా వస్తోన్న అంధవిశ్వాసాలు, తప్పించుకోలేని పేదరికం, ప్రతిదానికీ భయపడిపోయే తత్వం వాళ్ళ భయానికి ఇవన్నీ కారణాలు. అందువల్ల బికాస్ వాళ్ళను కోపగించుకోలేదు, ఏవగించుకోలేదు. సమాజ వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్ని ఉద్దేశ్యంతో కృషిచేస్తున్న ఉద్యమకారుడు కనుక శ్రమైకజీవుల విముక్తి కోసం పాటుపడడమంటే కార్మికుల మనసుల్లో ఇంకా మిగిలిన అపనమ్మకాన్ని పొగొట్టి వాళ్ళు ఆరోగ్యకరమైన మార్గంలో నడిపించడమే అని తనకు తాను సర్ది చెప్పుకున్నాడు.

"ఎంత సంపన్నులైనా సత్యం ముందు భీరువులే. వాళ్ళను ధనవంతులుగా, బలవంతులుగా నిలబెట్టేది వాళ్ళా. తమ జీవనధర్మంగా అనుసరిస్తోన్న వంచనా శిల్పమే .అయితే అసత్యానికి శాశ్వత నివాస స్థానమేదీ లేదు. అది ఒకరు తరువాత మరొకరుగా అనేక వంచకుల పంచన చేరిపోతూ ఉంటుంది. మనల్ని మోసపుచ్చే అబద్ధాలకూ ఉద్యమ రూపం దాల్చే చైతన్యం కలిగినప్పుడే మనకు విముక్తి అన్నాడు బాధాతప్త హృదయంతో.

ముకుతాడుతో ఎద్దుల్ని నియంత్రించడం తెలిసిన బండివాడు, పందేలతో వాటిని ఎలా ఒడుపుగా పరుగుతీయిస్తాడో అలాంటి ఒడుపును ప్రదర్శించాడు బికాస్.

అపనమ్మకాల్ని అనుమానాల్ని, భయాన్ని పొగొట్టే ఉద్దేశ్యంతో అనేక విధాలుగా వాళ్ళకు వివరించాడు. తమ భూములకు తగిన నష్టపరిహారాలు పొందడానికి బికాస్ నేతృత్వంలో పనిచేయడానికి ఎక్కువమంది రైతులు మొగ్గుచూపారు. ప్రణాళిక లేసుకొన్నారు.

ముందుగా బాధిత కర్షకులందరి సంతకాలు సేకరించి కలెక్టరుగారికి వినతిపత్రం సమర్పించి చర్చించాలనీ, అక్కడ న్యాయం జరగకపోతే ధర్నా నిరశన వ్రతం చేపట్టాలనీ, తద్వారా కూడా ఫలితం లేకపోతే పెళ్ళాంపిల్లలతో కలెక్టరుగారి కార్యాలయాన్ని ముట్టడి చేయాలనీ, చెరసాలకు వెళ్ళడానికైనా వెనుకాడకూడదనీ నిర్ణయించారు. సంప్రదాయ సిద్ధంగా యజమానుల పట్ల వినయవిధేయుతలు, గుడ్డినమ్మకాలూ కలిగిన వాళ్ళయినప్పటికీ ప్రేమించదగ్గవారుగానే కనిపిస్తారు. ఒకపని పట్ల ఆలోచన పట్ల గురి కుదిరితే, విశ్వసనీయతను భద్రంగా కాపాడే తత్వంగలవాళ్ళు.

రవికిరణ స్పర్శతో జీవకోటి నవనవోన్మేషంతో తొణికిసలాడినట్లు, ఐకమత్యంతోనే హక్కులు వేళ్ళూనుకొంటాయి అనుకొన్న బికాస్ తన ప్రయత్నం విజయవంతం అయినందుకు చాలా సంతోషించాడు. ఇక్కడి రైతులు చైతన్యం, ఇతర ప్రదేశాల్లోని బాధితకర్షకుల్లోనూ చైతన్యం కలిగిస్తుందని ఆశించాడు.

మా సహకారంతో మీరు కలిసికట్టుగా చేసే ప్రయత్నం విజయవంతమై, ఇతర ప్రదేశాల్లోని రైతులకు స్ఫూర్తిదాయకమవుతుంది. బయటివాళ్ళతో మీకు అనుబంధం కలిగిస్తుంది. అంటూ సెలవు తీసుకొన్నాడు.

**(ఇంకావుంది)**

# రంగులేద్దాం




## పదాలు రాసేద్దాం

ఫ్రెండ్స్! పై పజిల్లో కొన్ని బొమ్మలు వున్నాయి. పక్కనున్న గళ్లలో వాటి పేర్లకు సంబంధించిన అక్షరాలు కూడా వున్నాయి. మరెందుకు ఆలస్యం... వెంటనే మిగిలిన గళ్లని వాటి పూర్తి పేరుతో నింపేద్దామా.

## తేడాలు కనిపెడితే పోలా...

పిడుగులూ... కింద ఒకేలా కనిపిస్తున్న ఇద్దరు తాతలు కూర్చొని వున్నారు. కానీ వారిద్దరికీ ఆరు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టేద్దామా.



## ఎవరెస్టు ఎక్కేద్దామా...

ఫ్రెండ్స్... ఈ మంచుపర్వతం పైకి వెళ్లడానికి దారులన్నీ గజిబిజిగా వున్నాయి. ఇలాంటి దారుల్లోనుండి పైకి ఎవరు ముందుగా ఎక్కి ఆ జెండాని పట్టుకుంటారో మరి. చూద్దామా.

# బాలనేస్తాలు

## ఆకులతో సీతాకోకచిలుక

పిల్లలూ! చూశారుగా ఈ వారం మీకోసం సీతాకోకచిలుకను తీసుకొచ్చాం. మీరు కూడా ఇలాంటి ఆకారాలున్న ఆకులు తీసుకుని సీతాకోకచిలుకను తయారు చేస్తారుగా.





## మొత్తం ఎన్ని?

పిడుగులూ... ఈ జోకర్ భలేగా సర్కస్ ఫీట్లు చేస్తున్నాడు కదూ. అయితే మీరు ఏంచేయాలంటే ఇతని డ్రెస్‌లో బాక్సులాంటి ఆకారాలు ఎన్ని వున్నాయో చెప్పండి.





## చెప్పుకోండి చూద్దాం

చిన్నారులూ...ఇక్కడ ఎన్ని రకాల ఆటవస్తువులున్నాయో చూస్తున్నారుగా. మరి ఆ ఆటవస్తువుల పేర్లు చకచకా చెప్పేయండి.

## నేర్చుకుందాం

### జవాబులు

**చెప్పుకోండి చూద్దాం:** cricket, tennis, archery, table, tennis,golf, hockey, cricket, baseball.

**మొత్తం ఎన్ని?.. :** 15

**పదాలు రాసేద్దాం:** 1.picture,2.rope, 3.bell,4.calf, 5.pebbles.

**తేడాలు కనిపెడితే పోలా...:** తాత జేబు, చొక్కా కుడిచేయి, చేతికింద వున్న మఫ్లర్, టోపీ, జుత్తు, గడ్డి.

అట్టమీది కథ



# కీకారణ్యం నల్లమల అభయారణ్యం

- బ్రహ్మం

**నల్లమల అడవులు...వీటి గురించి తెలియని, వినని వారంటూ ఎవరూ ఉండరు. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నల్లమల అడవుల్లో దుర్మరణం చెందడంతో ప్రస్తుతం యావత్ భారతదేశం ఈ అడవులపై దృష్టి సారించింది. దట్టమైన అడవులివి. ఎత్తైన కొండలు...వేలాది అడుగుల లోయలు... పరుగులెత్తే సెలయేరులు...వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలు... అన్నింటికీ మించి విలువైన కలప ఈ అడవుల సొంతం. ఇక్కడ కనిపించే ఎత్తైన కొండలు, కొండల్లో నివసించే చెంచుల జీవితాలు, ప్రకృతి సహజంగా అక్కడ లభించే విలువైన సంపద, కట్టిన భారీ నిర్మాణాలు... వంటి వివరాలు ఈ వారం మీకోసం అట్టమీది కథలో...మీముందుంది. చదవండి మరి!**

పులుల సంరక్షణకు దేశంలోనే అతిపెద్ద అభయారణ్యంగా గుర్తించబడింది. రాజీవ్ టైగర్ ప్రాజెక్టుగా దీనికి పేరు. 190 కిలోమీటర్ల మేర కృష్ణానది ఈ అడవుల్లో గుండా ప్రవహించి, బంగాళాఖాతంలో కలుస్తుంది. దేశంలోనే ప్రసిద్ధి చెందిన శ్రీశైలం రిజర్వాయర్, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు నల్లమలలోనే ఉన్నాయి. మహబూబ్‌నగర్, గుంటూరు, ప్రకాశం, నల్గొండ, కర్నూలుజిల్లాల్లో నల్లమల అడవులు విస్తారంగా విస్తరించి ఉన్నాయి. కాకులు దూరని కారడవి...మనం కథల్లోనే చదువుకుంటాం... కానీ నల్లమల చూస్తే మనకి కథల్లో వినే కారడవి ఇలాగే ఉంటుందని ఊహించుకోవచ్చు. అడవులు, కృష్ణానది ఉండటంతో వన్యప్రాణులకు ఆవాసంగా మారింది. నీటికి కొరత లేనందు వల్ల అన్ని రకాల పశుపక్ష్యాదులు, క్రూర మృగాలు, విష సర్పాలు ఈ అడవుల్లో తలదాచుకున్నాయి. ఈ ప్రాంతంలో పులుల గణనకు వచ్చే ట్రెగర్ ట్రాకర్లు, అటవీ శాఖ ఉద్యోగులు దట్టమైన ప్రాంతాల్లోకి వెళ్లటానికి సాహసం చేయాల్సిందే. కొండలు, లోయలు, ఎత్తైన చెట్లతో ఈ అడవులు ఉంటాయి. చదునుగా ఉండే ప్రాంతాలు చాలా తక్కువ. కిలోమీటరు వెళ్లాలంటే కనీసం రెండు కొండలు, రెండు లోయలు ఎక్కిదిగాల్సిందే.

**ఎత్తైన కొండలు**

నల్లమల అడవులన్నీ చిన్నచిన్న రాళ్లు, రప్పలతో కూడిన కొండలతో ఉన్నాయి. కొండల మీద కూడా ఎత్తైన చెట్లు కూడా ఉండటం విశేషం. లోయలు, ఎత్తైన కొండలతో ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తుంది. ఎక్కడా నేల అనేది కనిపించదు. కింద మోకాలెత్తున కొండగడ్డి ఏపుగా పెరిగి ఉంటుంది. వేసవిలో సమీప ప్రాంతాల గ్రామస్తులు ఈ గడ్డినే పశువులకు ఉపయోగిస్తారు. కరువు కాటకాల్లో కొండ గడ్డే పశువులకు జీవనాధారం. సగటున 800 నుంచి 900 మీటర్ల ఎత్తైన కొండలు నల్లమల అడవుల్లో ఉన్నాయి. ఎన్ని లోయలున్నాయో లెక్కపెట్టడం కష్టం. కృష్ణానదితో పాటు చిన్న చిన్న నదులు, వాగులు, సెలయేర్లు ప్రవహిస్తుంటాయి. గుండ్లకమ్మ కూడా నల్లమలలోనే గుండ్లబ్రహ్మేశ్వరం వద్ద పుట్టింది. వర్షం వచ్చిన సమయంలో నల్లమల కొండలు, చెట్లు మబ్బులతో కమ్ముకొని ఉంటాయి. పట్టపగలు కూడా ముందు ఏముందో కూడా కనిపించని పరిస్థితిలో మేఘావృతమై దట్టమైన చీకటి ఆవరించి ఉంటుంది. వేసవికాలంలో మినహా మిగిలిన కాలాల్లో నల్లమల అడవుల్లోకి వెళ్లటం అంత సులువు కాదు. ఒండ్రు, నల్లమట్టి, చౌడు నేలతో నిండిన నల్లమల నేలలో వర్షాల సమయంలో వెళ్లటం చాలా కష్టం. ఈ మట్టిలో కాళ్లు పెడితే మోకాళ్ల వరకూ దిగబడిపోతాయి.

**చెంచులే నివాసులు**

నల్లమలలో చెంచులు, సుగాలీలు తండాలు ఏర్పాటుచేసుకొని నివసిస్తున్నారు. మహబూబ్‌నగర్, ప్రకాశం జిల్లాల్లో 150కి పైగా చెంచు



## పావురాల గుట్ట

అభయారణ్యంలోనే పావురాలగుట్ట వుంది. ఇక్కడకు గిరిజనులు తునికాకు, వెదురు ఏరుకోవడానికి వస్తుంటారు. వీళ్లు గుర్తుగా దానికి పావురాల గుట్ట అని పెట్టుకున్నారు. అలా వచ్చిందే ఆ పేరు. ఆత్మకూరుకు 25 కిలోమీటర్ల దూరంలో వుంటుంది. రుద్రకోడూరుకు 8 కిలోమీటర్ల దూరంలో వుంటుంది. పావురాల గుట్ట కింద ఏడుపాయల తిప్ప వుంది. సిఎం దుర్ఘటన జరిగింది అక్కడే. రుద్రకోడూరులో శ్రీకృష్ణదేవరాయలు కట్టించిన శివాలయం వుంది. అక్కడ ప్రతి శివరాత్రికి ఉత్సవాలు జరుగుతుంటాయి. చుట్టుపక్కల గిరిజనులు, సమీప గ్రామాల వాళ్లు ఉత్సవాల్లో పాల్గొంటారు.

పెంటలున్నాయి. వేంపెంట, నెమలిపెంట, ఈగలపెంట, సున్నిపెంట ...ఇలాంటి పేర్లు కర్నూలు, గుంటూరు, నల్గొండ జిల్లాలో తక్కువగా ఉన్నాయి. అక్కడక్కడా విసిరేసినట్లు ఇవి కనిపిస్తాయి. ప్రకాశం, కర్నూలు జిల్లాలకు రెండు ప్రధాన రహదారులున్నాయి. దోర్నాల నుండి శ్రీశైలం వెళ్లే మార్గం ఒకటి. రెండోది దోర్నాల నుంచి ఆత్మకూరు మీదుగా కర్నూలు వెళ్లే మరో మార్గం ఉంది. ఈ మార్గాలకు చేరుకోవటానికి వీలుగా చెంచులు తమ నివాసాలను ఏర్పాటుచేసుకున్నారు. అడవుల్లో లభించే కలపతో పాటు వెదురు, తేనె, చింతపండు, జిగురు వంటివి సేకరించి ఐటిడిఏ కేంద్రాలలో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఐటిడిఏ కూడా చెంచుల అభివృద్ధి కోసం కొన్ని కార్యక్రమాలు చేపట్టినా అవి...వారి దాకా అందటం ఎండమావే. శ్రీశైలం సమీపంలో సున్నిపెంట వద్ద ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసు ఉంది.

### సంచరించే మార్గాలు కాలిబాటలే

నల్లమలలో తిరగాలంటే కాలిబాటలే ప్రధానం. వాహనాలు తిరగటం చాలా కష్టం. కొన్ని రూట్లలో ఫారెస్టు వాహనాలు తిరుగుతాయి. పాలుట్ల అనే ప్రాంతంలోని గిరిజనులకు ఓట్లు కూడా ఉన్నాయి. అయితే ఇక్కడ ఎన్నికలు నిర్వహించటానికి అధికారులు హెలికాప్టర్‌ను వాడతారు. వీరికి నెలనెలా రేషన్‌సరుకులను లారీ ద్వారా అతికష్టం మీద చేరవేస్తారు. దోర్నాల నుంచి ఒక రోజు పోనూ, ఒకరోజు రాను సమయం పడుతుంది. అదేవిధంగా గుండ్లబ్రహ్మేశ్వరం, నాగులూటి, బయర్లూటి, మహానంది, సూర్యనంది, ఓంకారం, భీమునికొలను ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లడానికి కాలిబాటలున్నాయి. ఇంకా ప్రసిద్ధి చెందిన దేవాలయాలు కూడా ఉన్నాయి. అయితే ఇవి జనం చూడనివే ఎక్కువున్నాయి. వర్షాలు పడితే ఈ కాలిబాటలు కూడా మూసుకుపోతాయి. ఎటువైపు వెళితే ఏ మార్గం వస్తుందో కూడా అంతుచిక్కదు. శ్రీశైలం రహదారి నుంచి అడవిలోకి వెళితే అతికష్టం మీద గానీ ఆత్మకూరు రహదారికి చేరుకోలేరు. గిరిజనులు కూడా కాలిబాటల ద్వారానే బయటకు వచ్చి అటవీ ఉత్పత్తులను అమ్ముకుంటారు. సరుకులు తీసుకొని తలపై పెట్టుకొని అడవుల్లోకి వెళతారు.

### విలువైన సంపదకు నిలయం

నల్లమలలో చెట్లు ప్రధానంగా జిట్టేకు, ఎర్రచందనం, వెదురు. ఈ మూడూ చాలా విలువైన కలపగా వాడుకుంటున్నాం. ఆత్మకూరు, గిద్దలూరు, మార్కాపురం పట్టణాల్లో అటవీ శాఖ డివిజన్లున్నాయి. వీటి సంరక్షణ బాధ్యత ఈ ప్రాంతాల అటవీశాఖ అధికారులదే. అయితే నిత్యం ఎర్రచందనం, జిట్టేకు అక్రమంగా తరలిపోతోంది. స్మగ్లర్లు యధేచ్ఛగా అధికారులకు ముడుపులు ఇస్తూ...లారీల ద్వారా కలపను అడవుల నుంచి ఎల్లలు దాటిస్తున్నారు. కోట్లాది రూపాయల అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. మొక్కుబడిగా అప్పుడప్పుడు జరిగే డిఆర్సీ వంటి సమావేశాల్లో దీనిపై చర్చించినా ఆ తర్వాత చర్యలేమీ ఉండవు. పొట్టకూటి కోసం గిరిజనులు చిన్నచిన్న వెదురు బొంగులు తెస్తుంటే మాత్రం వారిని పట్టుకొని జైళ్లలో పెట్టడం, కేసులు బనాయించడం వంటి చర్యలకు మాత్రం అటవీశాఖ అధికారులు వెనుకాడరు. పెద్ద దొంగలను వదిలేసి, పేదలను పీడిస్తున్నారనే విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి. నోరూరించే ఉసిరికాయలు కూడా నల్లమలకు ప్రసిద్ధి.

### నల్లమలలో భారీ నిర్మాణాలు

శ్రీశైలం డ్యాంతో పాటు వెలుగోడు రిజర్వాయర్ నల్లమల పరిధిలోనే ఉన్నాయి. ఇంకా గుండ్ల బ్రహ్మేశ్వరం, నాగులూటి, కచ్చెరువు, పాలుట్ల, నెక్కంటి, చిన్నారుట్ల, భీముని కొలను, అర్ధవీడు లోయ, పెల్లలచెరువు, గంజివారిపాలెం, గాజులపాలెం, తదితర చోట్ల వివిధ నిర్మాణాలున్నాయి. 2004లో చేపట్టిన వెలుగొండ భారీ ప్రాజెక్టు కూడా నల్లమల పరిధిలోనే ఉంది. దీని రెండు టన్నెళ్లు 18 కిలోమీటర్ల పొడవునా నల్లమల అడవుల్లోనే తవ్వుతున్నారు. రాజీవ్ టైగర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఈ టన్నెళ్ళకు కేంద్రప్రభుత్వం ఆచితూచి అనుమతిచ్చింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎగువభాగం అంటే నీరు నిల్వ ఉన్న భాగం నల్లమల పరిధిలోకే వస్తుంది. బ్రిటీష్ వారి కాలంలో నంద్యాల, గుంటూరు రైల్వే ట్రాక్‌ను కూడా నల్లమల కొండల్లో గుండా వేశారు. రైల్లో ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటే బ్రిటీష్ వారి కాలంలో నిర్మించిన బ్రిడ్జీలు, టన్నెళ్లు కనిపిస్తాయి. గిద్దలూరు సమీపంలోని దిగువమిట్ట స్టేషన్‌కు భైరవగుండాల అనే కొండపై సెలయేరు నుంచి ఓ పైపు ద్వారా నీరు సరఫరా అవుతోంది. కరెంటు అవసరం లేకుండా ఐదు కిలోమీటర్ల నుంచి పైపు ద్వారా నీటిని తరలిస్తున్నారు. ఈ పద్ధతిని బ్రిటీషు వారి కాలంలో కనుక్కున్నారు. ఈ మార్గంలో నడిచే రైళ్లకు అవసరమయ్యే ఈ నీటిని ఇక్కడే నింపుకొనేవారు. కొన్ని సినిమాల్లోని పాటలను కూడా ఈ మార్గంలో చిత్రీకరించారు. నెమలిగుండ్ల రంగనాయకులు దేవాలయం, దాని పక్కన ఉన్న సెలయేరు యాత్రికులకు





ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది.

**పులుల సంరక్షణ**

నల్లమలలో పులులు, ఇతర క్రూరమృగాలు సంచరిస్తున్నాయి. దేశంలో 19 అభయారణ్యాలుండగా నల్లమలలోని రాజీవ్ టైగర్ ప్రాజెక్టు ఒకటి. ఇక్కడ పులుల సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వన్యప్రాణుల వేట ఇక్కడ నిషేధం. ఇక్కడ చిన్న జంతువును వేటాడినా వెంటనే కటకటాలపాలవుతారు. ఇన్ని చర్యలు తీసుకుంటున్నా అప్పుడప్పుడూ పులులు మృత్యువాత పడుతూ కనిపిస్తుంటాయి. అటవీశాఖ అంచనా ప్రకారం ఇక్కడ సుమారు 200 పులులు సంచరిస్తున్నాయని సమాచారం. దుప్పిలు, లేళ్ల ఎక్కువగా ఉన్నాయి. ప్రకాశంజిల్లాలోని పెద్దదోర్నాలకు ఉత్తర భాగాన కృష్ణానది ఒడ్డు వరకూ పులులు సంచరిస్తుంటాయి. ఈ ప్రాంతంలోనే నీరు ఎక్కువగా లభించటం వల్ల జంతువుల ఆవాస ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ పరిధినే రాజీవ్ టైగర్ ప్రాజెక్టు అంటారు. దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే మార్గం కూడా దీని పరిధిలోకి వస్తుంది. ప్రజల భద్రత రీత్యా అక్కడక్కడా పులులకు సంబంధించిన హెచ్చరికబోర్డులు కనిపిస్తుంటాయి. అటవీశాఖ అనుమతి లేకుండా ఈ ప్రాంతంలో సంచరించటం నిషేధం.

**మావోయిస్టులకు షెల్టర్‌జోన్**

ఒకప్పుడు ఉత్తర తెలంగాణాలో మావోయిస్టులపై ప్రభుత్వం దాడి పెరగడంతో ప్రత్యామ్నాయంగా నల్లమలను షెల్టర్‌జోన్‌గా మార్చుకున్నారు. 1995 తర్వాత నల్లమలలో మావోయిస్టుల కార్యకలాపాలు పెరిగాయి. ఇక్కడినుంచే మావోయిస్టులు అనేక విధ్వంస కార్యక్రమాలకు వ్యూహరచన చేశారు. మావోయిస్టులకు రోజుల తరబడి శిక్షణా తరగతులు కూడా ఇక్కడే జరిగేవంటారు. గుండ్లబ్రహ్మేశ్వరం, ఆలాటం కోట, వీరి ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. అయితే, నాలుగేళ్ల క్రితం గ్రేహౌండ్స్ ఈ ప్రాంతాలన్నింటినీ జల్లెడ పట్టినప్పటికీ ఎత్తైన కొండలు, లోయలతో కూడిన ఈ ప్రాంతంలో ఎవరెక్కడున్నారనేది కనుగొనటం చాలా కష్టం. వైర్‌లెస్ సెట్లు గానీ, సెల్‌ఫోన్లు గానీ ఇక్కడ పనిచేయవు. ప్రత్యేక పద్ధతుల ద్వారానే సమాచారం చేరవేస్తారు. మావోయిస్టులు వాకీటాకీలతో పాటు కొన్ని వ్యూహాత్మక పద్ధతులను ఆధునిక పరికరాలను ఉపయోగించేవారు. గిరిజనులను సమాచారానికి ఉపయోగించుకొనేవారు. మావోయిస్టు అగ్రనేతలు ప్రభుత్వంతో జరిపిన చర్చలకు నల్లమల నుంచే బయటకు రావడం, మళ్లీ లోపలికి వెళ్లడం జరిగింది. అదేవిధంగా మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి మాధవ్‌తో పాటు ముఖ్యనేతలు ఎన్‌కౌంటర్ కూడా నల్లమలలోనే జరగడం గమనార్హం. ఒక సందర్భంలో మృతదేహాలను తీసుకురావడానికి రెండు రోజులు పట్టింది.

**అభయారణ్యం వివరాలివీ...**

నల్లమల అడవులు ఐదు జిల్లాల్లో దట్టంగా విస్తరించి ఉన్నాయి. కర్నూలు, నల్గొండ, మహబూబ్‌నగర్, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఉన్న ఈ అడవులు సుమారు 9,388.05 చ.కి.మీలు విస్తరించి ఉండగా, ఇందులో 6,664 చ.కి.మీలు దట్టమైన ప్రాంతంగా గుర్తించారు. ఇక టైగర్ రిజర్వు ప్రాంతం కింద 3,568.09 చ.కి.మీలుగా పరిగణించారు. నల్లమల అడవుల్లో గుండ్లబ్రహ్మేశ్వరం వన్యప్రాణి అభయారణ్యం, మానవరహిత ప్రాంతం. ఇది నంద్యాల సర్కిల్‌లో 418.30 చ.కి.మీలు, గిద్దలూరు ప్రాంతంలో 390.22 చ.కి.మీల మేర విస్తరించి ఉంది. మొత్తంగా నల్లమల అడవులను నాలుగు డివిజన్లుగా అటవీ శాఖ విభజించింది. దట్టమైన అటవీ ప్రాంతం కర్నూలు జిల్లా ఆత్మకూరు డివిజన్‌లో 1228 చ.కి.మీ., మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట డివిజన్‌లో 2454 చ.కి.మీ, ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్ పరిధిలో 2229 చ.కి.మీలు విస్తరించి ఉండగా, నాగార్జునసాగర్ డివిజన్‌లో 753 చ.కి.మీల మేరకు ఈ దట్టమైన అడవులు విస్తరించి ఉన్నాయి.

**నల్లమలలోనే ప్రాణాలొదిలిన ముఖ్యమంత్రి వైఎస్**

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నల్లమల అడవుల్లోనే ప్రాణాలు వదిలారు. ఆయనతో పాటు మరో నలుగురు అధికారులు మృతిచెందారు. కర్నూలుకు 70 కి.మీల దూరంలో ఉన్న రుద్రకోడూరు సమీపంలోని పావురాలగుట్టపై హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఈ ప్రాంతాన్ని కనుగొనటానికి 24 గంటల సమయం పట్టిందంటే నల్లమల ఎంత కీకారణ్యమో అర్థం చేసుకోవచ్చు. కనీసం హెలికాప్టర్‌లో నుంచి కిందకు దిగటానికి కూడా రిస్కు టీంలు చాలా సాహసం చేయాల్సి వచ్చింది. ఆత్మకూరుకు 20 కిలోమీటర్లలోనే ఉన్న ఈ ప్రాంతాన్ని చేరుకోవటానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, పోలీసు, ఆర్మీ అధికారులు, పాత్రికేయులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ ప్రాంతంలోనే ముఖ్యమంత్రి వైఎస్‌కు ఘాట్ నిర్మించాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఈ విధంగా ముఖ్యమంత్రి దుర్మరణంతో నల్లమల భారతదేశ చిత్రపటంలో మరోసారి ముందుకొచ్చింది. ★

## పర్యావరణానికి ప్రాణం నల్లమల

**పచ్చదనాన్ని పండించే ఎత్తయిన చెట్ల పవనాలు పర్యావరణ పరిరక్షణకు ప్రాణం పోస్తున్నాయి. ఏపుగా పెరిగే జిట్టేకు, యేగ, కరక, మున్నీటి కరక, మొదటి కరక, పచ్చ ఆరె, టుంకి, ఇనుమొద్ది, సోమి, అడవి వేప, గొటికె, బొటక, కర్నేగ, పెద్దజాన, చిన్నజాన, గుంపెన, దంతె, వెదురు, సిరిమాను, టేకు, ఏపె, ముల్లెదెరు, మాడపాకు, బిల్లుడు పేర్లతో పిలువబడే చెట్లు ఈ అడవుల్లో అధికంగా ఉన్నాయి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం నేపథ్యంలో ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్స్ వస్తువుల వల్ల వెలువడే కాలుష్యాన్ని చెట్ల నుండి వెలువడే ప్రాణవాయువు నివారించేందుకు ఉపయోగపడుతున్నాయి. అటవి శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అటవి సంపద అక్రమార్కుల గొడ్డలి వేటుకు బలవుతోంది. కలుషితమైన నీటి తాగడం వల్లే అధికంగా వ్యాధుల భారిన పడుతున్నారు. బండెడ, నేంద్ర, గోకడ, మూండ్ర, పులకాసి గడ్డి, బోద పేర్లతో గడ్డి ఏపుగా ఎత్తుగా పెరుగుతోంది. పులకాసి గడ్డి పశువులకు బలంగా ఉంటుంది.**

విజ్ఞాన వేదిక

నిద్ర సుఖమెరగదన్నారు పెద్దలు. అతినిద్ర మూర్ఖత్వానికి సంకేతమన్నారు. మనిషి ఎన్ని గంటలు నిద్రపోవాలో ఇంకా నిపుణులు నిర్ణయించే ప్రయత్నంలోనే వున్నారు. సృష్టిలో దాదాపు ప్రతి జీవీ నిద్రపోతుంది. మనిషి తన జీవితకాలంలో మూడవభాగం నిద్రలోనే గడిపేస్తాడు. కొంతమంది ఇంకా ఎక్కువే గడుపుతారనుకోండి. కానీ ఇంకొంతమంది 'నిద్రంటే ఏమిటి?' అన్నట్టు జీవించేస్తారు. అసలు మనిషి ఎందుకు నిద్రపోతాడో ఇంతవరకూ ఇదమిద్ధంగా తెలియకపోయినా ఆ ప్రక్రియ మాత్రం చాలా అవసరమని మాత్రం ఖరారైంది.

# నిద్ర లాభమా?

- డా॥కాకర్లమూడి విజయ్

**ని**ద్రవల్ల లాభాలకంటే ముందు నిద్రలేమి వల్ల నష్టాలు తెలిశాయి. సరైన నిద్ర లేకపోతే ఏ పనిమీదా మనసు లగ్నం చేయలేకపోవడంతో పాటు జ్ఞాపకశక్తి సన్నగిల్లడం, అలసట, చిరాకు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. నిద్రలేమి తాలూకు ప్రయోగాలు ఎలుకల్లో చేసి చూసిన పరిశోధకులకు వింత సమాధానాలు లభించాయి. మామూలుగా ఎలుకలు రెండు మూడేళ్ళ జీవిస్తాయి. వాటికి నిద్రను దూరం చేసి ప్రయోగాలు జరుపగా అవి అయిదు వారాలకు మించి బతకలేదు. పైగా వాటికి రోగనిరోధకశక్తి క్షీణించి, పుండ్లు కూడా వచ్చాయి. అయితే విపరీతంగా నిద్రపోవడం వల్ల వందలాది ఏళ్ళు బతికేస్తామన్న భరోసా కూడా లేదు. కాకపోతే నిద్రలో మనకి కొన్ని ప్రయోజనాలు జరుగుతాయి. పిల్లల్లో ఎదుగుదల హార్మోన్లు ఆ సమయంలోనే విడుదలౌతాయి. మెదడులో నాడీకణాలు అప్పుడే పునరుత్తేజమౌతాయి. ఓ అయిదారు గంటల పాటు పెద్దపెద్ద అవయవాలన్నీ కాస్త నెమ్మదిస్తే మిగతా భాగాలన్నీ రిపేర్లు చేసుకుంటాయి.

అయితే నిద్ర మెదడుకి మేలు చేస్తుందన్నది కాస్త వివాదాస్పదంగా మారింది. పరిణామ క్రమంలో క్రిందిస్థాయి జీవులు కూడా కొన్ని నెలల సుదీర్ఘ షుప్తావస్థలోకి వెళతాయి. అటువంటి వాటిలో చాలావాటికి అసలు మెదడే లేదు. పైగా మెదడు నిద్రలో ఒక్కొక్కరిలో ఒక్కోరకంగా ప్రవరిస్తుంది. చంటిపాప చిన్న కదలికకే తల్లి నిద్రనుండి లేచేంత చురుగ్గా వుంటే – ఒకపక్క ఉరుములు, పిడుగులు పడ్డా ఉలుకూ పలుకూ లేకుండా మొద్దులా నిద్దరోయేంత మందంగానూ వుంటుంది. మెదడు ఎనిమిది గంటల పాటు పని చేసిన తరువాత ఎనిమిది–పది గంటల గాఢనిద్ర మనకవసరం. కాని అసలు నిద్రనే మాటే లేకుండా రోజుల తరబడి మేలుకోవడం అటుంచి ఖండాలు ఖండాలు దాటుకుంటూ వెళ్లే వలస పక్షులు ఇంకా మానవ మేధకు మేతనిచ్చేవే!

చిన్నపిల్లలు ఎక్కువ నిద్రపోతారు. ఎందుకంటే వారిలో జీవచర్యలు (మెటబాలిజం) అధికంగా జరుగుతాయి. నిద్రవల్ల అవి తక్కువ స్థాయిలో పని చేస్తాయి. కానీ శాస్త్రజ్ఞులు చిన్న పిల్లల నిద్రకు మరో కారణాన్ని ఆపాదించారు. పసితనంలో వారికి పెద్దల రక్షణ వుంటుంది. ఆ ధీమాతోనే ఆదమరచి నిదురించే అలవాటు అభివృద్ధి చెందిందని శాస్త్రవేత్తల వివరణ. బహుశా అదే కోణంలో వృద్ధుల నిద్రనూ వివరించవచ్చేమో. వారికి ఏ క్షణం ఏం జరుగుతుందోనన్న భయం వల్ల నిద్ర అసలు పట్టదు కాబోలు. భిన్నత్వం మానవుల్లోనే కాదు– దాదాపు అన్ని జంతువుల్లోనూ వుంది.

తాజా పరిశోధనల వల్ల తేలిందేమిటంటే నిద్రవల్ల శరీరం తన వ్యవస్థను మెరుగు పరుచుకుంటుందని. కాబట్టి నిద్ర ఎంతోకొంత అవసరం. అదీ సరైన సమయంలోనే అయితే మరింత మంచిది. కొంతమంది భోజనమవ్వగానే (మధ్యాహ్నం) కునుకు తీయాల్సిందే. కొంతమంది తెల్లవార్లూ 'పార్టీ'లు చేసుకుంటూనే వుంటారు. అందుచేత 'అతి' మానేసి మితంగానైనా కంటి నిండా నిద్రపోవడం జీవన నాణ్యతను పెంచుతుందని తెలుపుతుంది.





# సమాంతర చిత్రాలకే సత్కారం

# వెలుగు లేని తెలుగు సినిమా!

- పీపీ

యాభై అయిదవ జాతీయ చలన చిత్ర అవార్డులను పరిశీలిస్తే సమాంతర చిత్రాలకూ భిన్న కథాంశాలకూ వైవిధ్య భరితమైన నటనకూ పట్టం కట్టినట్టు కనిపిస్తుంది.ఆ మేరకు మూస ధోరణులు చూయింగ్ గమ్ కథలూ తిరస్కరణకు గురైనాయి. ఇంగ్లీషు పత్రికలలో దక్షిణాదికి పెద్దపీట అని రాసినా వాస్తవంలో దక్షిణాన అతి పెద్ద భాషగా వున్న తెలుగుసినిమాకు కాస్తయినా చోటు దక్కకపోవడం విస్మరించలేని విషయం. నట కుటుంబాల విస్తృత ప్రచారార్భాటాల మధ్య వసూళ్ల పటాటోపాల మధ్య చూస్తే ఇది పెద్ద విడ్డూరంగా అనిపించవచ్చు. కాని మన సినిమాలు విమర్శనాత్మకంగా చూసే వారెవరూ ఇందుకు ఆశ్చర్యపోరు. ఒకప్పటి రోజులతో పోలిస్తే తెలుగు సినిమా హీరోలు దర్శకులు సామాజిక ఇతివృత్తాలకు పూర్తిగా తిలోదకాలిచ్చి వసూళ్ల వలయంలో గిరికీలు కొడుతున్నారని చెప్పడానికి పెద్ద సినీ పాండిత్యం అక్కర్లేదు. ఆ పూట సినిమా చూసే సగటు ప్రేక్షకుడితో ఆహా ఓహో అనిపించి కాసులు కురిపించుకోవడమే మన దర్శకులకూ హీరోలకు వేదవాక్యమైపోతున్నంత కాలం ఈ పరిస్థితి కొనసాగవచ్చు. ఇంతకూ మన చిత్రాలకు ఈ దురవస్థ ఎందుకు ప్రాప్తించిందో తెలియాలంటే ఇప్పుడు పురస్కారం పొందిన చిత్రాల ప్రత్యేకతలను ఒకసారి తేరిపార చూడొచ్చు.

ఈసారి జాతీయ ఉత్తమ చిత్రం అవార్డు పొందిన 'కంజీవరం' కథానాయకుడైన ప్రకాశ్ రాజ్ ఉత్తమ నటుడి పురస్కారాన్ని కూడా దక్కించుకున్నారు. ప్రియదర్శన్ దర్శకుడు. తమిళులు 'కంజీవరం' అనేది కంచిగా మనకు సుపరిచితమైన పుణ్యక్షేత్రంగానే పట్టుచీరల నిలయంగానూ ప్రసిద్ధి. కంచిపట్టు చీరలు నేసే చేనేత కార్మికుల స్థితిగతులను చిత్రించిన తీరు జ్యూరీ మెప్పు పొందింది. 1920-48 మధ్య కాలాన్ని కళ్లకు కడుతుంది. మొదట్లో ఏ అభిప్రాయాలు లేకుండా వుండి క్రమంగా కమ్యూనిస్టుగా మారే పాత్రను ప్రకాశ్ రాజ్ ధరించారు. క్రమంగా అతను తన వ్యక్తిగత అభ్యున్నతి, సామాజిక సమానత్వం అనే రెండు విలువల మధ్య చిక్కుకుపోతాడు. కన్నడిగుడుగా పుట్టి తమిళనాట నటుడై తెలుగు సినిమాల ద్వారా ప్రఖ్యాతి సాధించిన ప్రకాశ్ రాజ్ నట విశ్వరూపాన్ని చిత్రంలో చూడగలము. (ఆయనతో పాటు తెలుగు నటి శ్రియా రెడ్డి కూడా ఈ చిత్రంలో ఒక విభిన్న పాత్ర ధరించడం విశేషం)

కన్నడ నటీమణి ఉమాశ్రీ 'గులాబీ టాకీస్' అనే చిత్రంలో దుర్మార్గానికి బలై ఆపైన సమాజంలోనూ చీత్కారానికి గురైన ముస్లిం మహిళ పాత్రకు రజత కమలం పొందారు. నవ్య సినిమా జనకుల్లో ఒకరుగా పరిగణించబడే గిరీష్ కాసరవల్లి తీసిన ఈ చిత్రంలో టీవీ మీడియా ఉత్తర కోస్తాలోని మత్స్య కార్మిక మహిళలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నది చెబుతుంది. అంతర్జాతీయ వాణిజ్య పోటీలు, రగిలే మతకలహాల నేపథ్యం కూడా ఈ చిత్రం కళ్లకు కడుతుంది.

ఇక ఉత్తమ దర్శకుడుగా విఖ్యాత ప్రయోక్త అదూర్ గోపాలకృష్ణన్ చిత్రం 'నాలు పెన్నుంగళ్' ఎన్నికవడం ఎవరినీ ఆశ్చర్యపర్చదు. భారతీయ సినిమాను కొత్త మలుపులు తిప్పి శారదను మహానటిని చేసిన 'స్వయంవరం' చిత్రానికి గాను ఆయన 1972లోనే స్వర్ణకమలం పొందారు. మళయాలంలో ప్రగతిశీల సాహిత్య పితామహుడైన తగళి శివశంకర పిళ్లై రచించిన నాలుగు కథలలోని నలుగురు మహిళల జీవితాలను కలిపి రూపొందించిన ఈ కథ సాహిత్యపరంగానూ ప్రయోగమే. ఒకు నియమంగళ్ కథ, కన్యక, చిన్నమ్మ, నిత్యకన్యక అన్న కథలను కలిపి తీసిన ఈ చిత్రంలో ఒకరు సెక్స్ వర్కర్, మరొకరు రైతు, ఇంకొకరు గృహిణి, ఆఖరి వారు చేనేత మహిళ. దూరదర్శన్ ప్రతిపాదనపై అదూర్ తగళి కథలను పున:పరిశీలించడం మొదలెట్టారు. వివాహానికి సంబంధించి వారి వారి ప్రతిపత్తి వేరైనప్పటికీ అందరి పరిస్థితి అంతిమంగా ఒకేలా మారింది. జీవిత భాగస్వాములు, సన్నిహిత కుటుంబ సభ్యులు ఘోరంగా నిర్లక్ష్యం చేశారు. ఆ విధంగా పురుషాధిక్య సమాజంలో జెండర్ వివక్షను

అత్యంత సున్నితంగానూ సునిశితంగానూ ఆయన తెరకెక్కించడం అవార్డు తెచ్చిపెట్టింది. ఈ చిత్రం ఎడిటింగ్‌కు గాను బి.అజిత్ కుమార్‌కు కూడా ఉత్తమ పురస్కారం దక్కింది. ఇవన్నీ కేరళలోని కుట్టనాడ్ కేంద్రంగా జరిగే కథలైనా వాటిలోని ఇతివృత్తం విశ్వజనీనమైంది కనుకనే అనేక అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో దీనికి పురస్కారాలు లభించాయి.

మళయాల సినిమాకు అంతర్జాతీయ స్థాయి కల్పించిన అదూర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి చిత్రాలు రాకపోవడానికి ప్రేక్షకులలో అభిరుచి లోపించడమే కారణమన్న వాదనను కొట్టిపారేశారు. స్వయంవరం చిత్రానికి అవార్డు వచ్చిన తర్వాత తిరిగి విడుదల చేస్తే అఖండ విజయం సాధించింది. అలాగే కొడియాట్టం కూడా కొన్ని చోట్ల 125 రోజులు నడిచింది. మరి ఇప్పుడు ఈ చిత్రానికి అలాంటి స్థితి వుంటుందా అని సందేహం వెలిబుచ్చారు. ఇష్టానుసారం కథ పాడు లేకుండా చిత్రాలు తీసి అవి ఆర్ట్ ఫిలింలని చెప్పేవారిని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఏ మాత్రం వినోదం లేని ఆ చిత్రాలు సగటు ప్రేక్షకుడిని ఎలా ఆకట్టుకుంటాయి? ఇవన్నీ చూసిన వారు నా చిత్రాలను కూడా ఆర్ట్ చిత్రాల పేరిట తీసిపారేస్తారేమోనని సందేహంలో పడ్డాను. అందుకే నేను కథలు చెప్పడానికి తీస్తాను గాని ఆర్ట్ కోసం కాదని పదే పదే చెబుతుంటాను అని అదూర్ చమత్కరించారు.

ఉత్తమచిత్రం అవార్డుతో పాటు కార్టూన్ చిత్ర విభాగంలోనూ తమిళసినిమానే ముందు నిల్చింది. 'ఇనిమే నాంథాన్' అన్న ఆ చిత్రంలో సృజనాత్మకమైన యానిమేషన్ పాత్రలు దుష్టశిక్షణ శిష్టరక్షణకోసం ఎంతగానో పోరాడటం హాయి గొల్పుతుంది.

భారతీయ సినిమా రంగంలో ప్రస్తుతం మకుటం లేని మహరాజులాంటి షారుక్ ఖాన్ 'చక్‌దే ఇండియా', మరో అగ్రకథానాయకుడు అమీర్ ఖాన్ 'తారే జమీన్ పర్' చిత్రాలు కూడా వేర్వేరు విభాగాల్లో పురస్కారం పొందడం బాలీవుడ్‌కు సంతోషం కలిగించే విషయం. చక్కటి వినోదం కలిగించిన పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రంగా 'చక్‌దే ఇండియా' అత్యుత్తమ జన రంజక అవార్డు పొందితే 'తారే జమీన్ పర్' ఇతివృత్తానికి తగినట్టే మంచి కుటుంబ సంక్షేమ పురస్కారం తెచ్చుకున్నది. ఈ చిత్రంలో పాటలుపాడిన శంకర్ మహదేవన్ ఉత్తమ గాయకుడుగానూ, ప్రసూన్ జోషి గీతకారుడుగానూ బహుమతులు గెల్చుకున్నారు. గాంధీజీకి దూరమైన ఆయన కుమారుడి కథ ఆ ధారంగా తీసిన 'గాంధీ మై ఫాదర్'లో మహాత్ముడి పాత్ర వేసిన దర్శన్ ఝరీవాలాకు ఉత్తమ సహాయనటుడి అవార్డు రావడమే కాక జాతి పిత జీవితంలో వెలుగు చూడని కోణాన్ని ఆవిష్కరించినందుకు ప్రత్యేక ప్రశంస లభించింది. 'జబ్ వుయ్ మెట్' చిత్రంలో నృత్యానికి గాను షాహిద్ కపూర్‌కు పురస్కారం దక్కగా అదే చిత్రంలో పాట పాడిన శ్రియా ఘోషాల్ ఉత్తమ గాయనిగా ఎన్నికైంది. ఫోటో ఉత్తమ బాలల చిత్రంగా ఎన్నికైంది. 'ఓం శాంతి ఓంశాంతి'కి కళాదర్శకత్వంలో పురస్కారం దక్కింది.మరో హిందీ చిత్రం 'ఫ్రోజెన్ ఇందిరాగాంధీ' తొలి చిత్ర దర్శకుడి అవార్డు పొందింది. వాణిజ్య సినిమాకే వరవడి పెట్టిన హిందీ అగ్రనటులే కాస్త వైవిధ్యంతో ఈ విజయాలు సాధించగా ఘనత వహించిన తెలుగు సినిమా వెలవెల పోవడం ఎంత విచారకరం? మరెంత బాధాకరం?

'బాలిగంజ్ కోర్టు' అనే బెంగాలీ సినిమా, నిరోప్ మరాఠీ సినిమాలతో పాటు రామస్వామి నాయకర్ జీవితంపై తీసిన పెరియార్ చిత్రం కూడా ప్రాంతీయ స్థాయిలో మన్నన పొందాయి. రజనీ కాంత్ శివాజీలో స్పెషల్ ఎఫెక్టులు పతకం తెచ్చిపెట్టాయి. చెప్పాలంటే ఇంకా చాలా చిత్రాలు చిన్నాపెద్దా అవార్డులు తెచ్చుకోగలిగాయి. కాని తెలుగు సినిమాకు మాత్రం ప్రాంతీయ ఉత్తమ విభాగంలోనూ ఒక్కటంటే ఒక్క బహుమానం దక్కలేదు! టాలీవుడ్ హేమాహేమీలు ఒక్కక్షణమైనా ఆలోచిస్తారా మరి?

## కెమెరాను మాట్లాడనివ్వండి!

**ఈ**సారి ఉత్తమ చిత్రాల ఎంపిక కార్యక్రమం చాలా ఉత్సాహం కలిగించింది. అనేక కొత్త చిత్రాలు వచ్చాయి. నూతన దర్శకులూ వచ్చారు. వాస్తవానికి ఎవరు ఉత్తమ దర్శకుడో ఎంపిక చేయడం సమస్యగా మారింది....కాని తెలుగు, మళయాలం, బెంగాలీ చిత్రాలలో లోతులేక పోవడం మాకు నిరుత్సాహమనిపించింది. ఈ రాష్ట్రాల నుంచి వచ్చిన చిత్రాలలో చాలా వాటిని చూస్తుంటే ఎడతెగని సంభాషణలే వున్నాయి. అసలు కెమెరాకు పని వుంటుందనే వాస్తవం కూడా అవి గమనించినట్టు లేదు.చాలా మంది దర్శకులు దాన్ని అసలు మాట్లాడనివ్వలేదు

- సాయి పరంజపే,
ఉత్తమ చిత్రాల ఎంపిక కమిటీ చైర్మన్.

## క్రైమ్ కథ

# సాక్షి

**- యర్నాగుల సుధాకరరావు**

**అప్పటికి బెర్తుమీద కారిన రక్తాన్ని గుడ్డలతో తుడిచి కిటికిలోంచి విశిరేసాడు. ట్రయిన్ ఆగింది. అప్పుడు నన్ను చూశాడు.అంతే గతుక్కు మన్నాడు. "ఏయ్ ఎస్తేరీ నీవా? నేను చేసినదంతా చూసావు.ఎక్కడైనా పెదవి విప్పావో నిన్ను బతకనీయను.ఇప్పుడే నిన్నుచంపేదును.ట్రయిన్ ఆగిపోయింది.నిన్ను చంపితే నేను పట్టుబడతాను"**

ఎస్తేరు రాణి హత్యచేయబడిందా?ఆమె ఒక కాన్వెంటులో టీచరు. ఆమెను ఎవరు, ఎందుకు చంపారు? అదీ పొట్టలో లోతైన కత్తిగాయం ఉంది. పట్టణంలో అంతా ఇలానే అనుకున్నారు. ఎందుకు చంపబడింది ఆమె గురించి కాన్వెంటులో మంచిగానే చెబుతున్నారు.పెద్దజీతానికి కేరళనుంచి తీసుకొచ్చింది కాన్వెంటు యాజమాన్యం.ఉన్నంతలో అందరితో మంచిగానే ఉంది.

పోలీసులు వచ్చారు. రాణి ఇంటితలుపులు తెరిచి ఉన్నాయి. మూడుగదుల ఇల్లు.తలుపు తెరవగానే హంతకుడు పొడిచాడని ఆమె పడిపోయిన తీరును చూసి అర్ధంచేసుకున్నారు.ఆమె నైటీలో ఉంది. ముఖంలో భయాందోళనలు చెరగకుండా అలానే ఉన్నాయి. ఇంటిలో వస్తువులేవీ పోలేదు. అసలు హంతకుడు కేవలం ఎస్తేరురాణిని చంపడానికి వచ్చాడన్నట్టుగానే ఉంది.

పదిహేనురోజులైనా రాణి హత్యకేసులో ఒక్కఅడుగు ముం దుకు పోలేదు. దర్యాప్తు నత్త నడక నడుస్తోంది. పోలీ సులు అన్నికోణాల్లో వెతుకుతున్నారు. ఆమె గురించి వాకబు చేయడానికి కేరళ వెళ్లారు. అక్కడ ఆమె గురించి చాలా మంచిగా చెప్పారు. ఆమె తగవుల మనిషి కానేకాదు అనికూడా తెలిపారు. వెనక్కి వచ్చేసారు.ఆమె 35ఏళ్ల అవివాహిత.ఆమెకు కాన్వెంటు, ఇల్లు తప్పితే ఇతరత్రా ఎందులో ఉండదు. ఆమెవద్దకు వేరెవ్వరు వచ్చి పోయే వారు లేరు. పోలీసులకు అంతా అయోమయంగా ఉంది.

ఒకరోజు పోస్టుమాన్ ఆమె రాసిన రిజిస్టర్డ్‌పోస్టు లెటర్ వెనక్కి రావడంతో కాన్వెంట్ యాజమాన్యం వారికి ఇచ్చి సంతకం చేయమన్నాడు. ఆమె మర్డర్ అయ్యింది. "ఆమె ఎవరో ఫ్రెండుకు లెటర్ రాసుకుంది. మాకు ఇస్తే కాదు. పోలీసులకు అందచేయ్.ఇకనుంచి ఆమెకు సంబందించిన ఏఉత్తరాలు వచ్చినా పోలీసులకు ఇచ్చేయ్" అని చెప్పి పంపేసారు. పోస్టుమాన్ పోలీస్‌ఠాణాకు వెళ్లి లెటర్ అందించాడు.

ఇన్‌స్పెక్టర్ ఆ లెటర్ వెనక అడ్రసు చూసాడు. తిరువనంతపురానికి చెందిన ఉన్ని మేరీకి రాసుకుంది. డోర్‌లాక్ కారణంగా వెనక్కి వచ్చేంది.అందులో ఏముందా అని తెరిచి చూసాడు.

మేరీ, ఈరోజు ట్రయిన్‌లో తిరువనంతపురం నుంచి చెన్నయ్ వస్తున్నాను. ఇది అన్‌సీజన్ కనుక కంపార్టుమెంటులో జనాలు పెద్దగా లేరు.రాత్రి పదింటికి నేనున్న కంపార్టుమెంటులో ఇద్దరోముగ్గురో ఉన్నారు. వారిలో ఒకపెద్దాయన మీనన్ కూడా ఉన్నారు.నాతో చదువుల కోసం ఏవో కాలాక్షేపకబుర్లు మాట్లాడారు.అంతలోనే కోయంబత్తురు సమీపిస్తుండగా నీతమ్ముడు డేవిడ్ వచ్చాడు.అల్లంతదూరంలో చూసాను. అప్పుడు నేను తలవంచుకుని ప్రేయర్ చేయబోతూ చూసాను.ప్రేయర్ అయ్యాక మాట్లాడదామనుకున్నాను.నాముందు బెర్తుమీద ఉన్న ఆయనపై కత్తితీసి లిప్తలో పొడిచేసి బెర్తుమీదనుంచి కిందకు తోసాడు.క్షణాల్లో చచ్చిపోయాడు పెద్దాయన.డేవిడ్ నన్ను అప్పటికి గుర్తుపట్టలేదు. నావైపు ఒకటిరెండు సార్లు కత్తి ఝళిపించడంతో నాప్రాణాలు నాలో నిలవనంతగా రెపరెపలాడాయి. డేవిడ్ పెద్ద ప్లాస్టిక్ కవరు తెరిచి అందులో శవాన్ని చుట్టేసాడు. చతురస్రాకారంలో మూట కట్టాడు. కోయంబత్తూరు రానే వచ్చింది. అప్పటికి బెర్తుమీద కారిన రక్తాన్ని గుడ్డలతో తుడిచి కిటికిలోంచి విశిరేసాడు. ట్రయిన్ ఆగింది. అప్పుడు నన్ను చూశాడు.అంతే గతుక్కు మన్నాడు. "ఏయ్ ఎస్తేరీ నీవా? నేను చేసినదంతా చూసావు.ఎక్కడైనా పెదవి విప్పావో నిన్ను బతకనీయను.ఇప్పుడే నిన్నుచంపేదును.ట్రయిన్ ఆగిపోయింది.నిన్ను చంపితే నేను పట్టుబడతాను" అని కోపంగా నావైపు చూస్తూ ఆశవం మూటతో కిందకి దిగేసి కదులుతున్న మరోట్రయిన్ ఎక్కాడు. ఇదంతా నాకళ్లముందే ఉత్కంఠగా సాగిపోయింది.నాకు చెమటలు పోసి నిశ్చేష్టురాలినయ్యాను.

నీతమ్ముడు మరి మారలేదు.నాకెందుకో భయంగాఉంది.నన్నేమి చేయడు కదా! నాకళ్లముందే జరిగిన హత్యచూసాను తప్పితే ఎక్కడా నోరువిప్పలేదు. డేవిడ్ మనమధ్య ఉండేవాడు. కనీసం నీఫ్రెండు నని లేకుండా నేను చూసినందుకు చంపడానికి సిద్ధపడ్డాడంటే వాడెంతగా మనస్సు లేనివాడయ్యాడు. అందుకే నీకీ ఉత్తరం రాస్తున్నాను. వేరెవ్వరు చదవకుండా రిజస్టర్ లెటర్ రాస్తున్నాను. చదవి చించేయ్.నీకు ఫోన్ చేస్తుంటే రింగ్ అవుతోందిగానీ ఎవరూ ఎత్తడం లేదు.అందుకే లెటర్ రాసాను.వీలుంటే నాతో ఫోన్‌లో మాట్లాడు.

నీ ఎస్తేరురాణి.

ఇన్‌స్పెక్టర్ పదేపదే ఆలేఖ చదివి కేరళ బయల్దేరాడు.అక్కడ ఉన్నిమేరీకోసం ఆమె ఇంటికి వెళ్లాడు.ఆమె నెలరోజులు ఉద్యోగరీత్యా ట్రయినింగ్‌కు వెళ్లివచ్చింది. ఆలేఖ అందించాడు. అప్పుడు ఆమె ఏమీ దాచకుండా డేవిడ్ గురించి చెప్పింది. వాడు మాకంటే నాలుగేళ్ల చిన్నవాడు.ప్లస్‌టూ వరకు మంచి బాలుడు. అక్కణ్నించి వాడు చెడు సావాసాలతో కిరాయి హత్యలవరకు ఎదిగాడు. అయ్యో ఎస్తేరిని వాడే చంపిఉంటాడు. నాకు ఈమధ్య అక్కా ఎస్తేరి ఎక్కడుంది? అని ఫోన్‌లో వాకబుచేస్తే నేను చెప్పాను. వాడు ఇలా హత్య చేస్తాడని నాకేం తెలుసు" అని బావురుమంది.

డేవిడ్ గురించి కేరళ పోలీసులతో కలిసి వెతికి మరీ పట్టుకున్నాడు ఇన్‌స్పెక్టర్. డేవిడ్ నిజాలు ఒప్పుకోక తప్పలేదు.తాను కిరాయికి కొచ్చిన్‌వాసి అయిన మీనన్ అనే పెద్దవ్యాపారిని చంపేందుకు అదే ట్రయిన్‌లో బయల్దేరాను. ఆరోజు బాగా ముసురు పట్టినందున కంపార్టుమెంటులు ఖాళీగా ఉన్నాయి.మీనన్ చంపేటపుడు ముందుసీటులో కూర్చున్నది ఎస్తేరురాణి అని అనుకోలేదు.వేరెవ్వరైనా కత్తిచూపితే బెదరిపోతుంది అని అనుకున్నా. బాగా తెలిసినామె. హత్య జరిగాక శవాన్ని దగ్గరగా చేసి పెద్ద ప్లాస్టిక్ షీట్‌లో చుట్టేసి మరీ శవంతో దిగిపోయి బెంగుళూర్ వెళ్లే ట్రయిన్ ఎక్కాను.అర్ధరాత్రి రకరకాల రైళ్లు మారుతూ మర్డర్ పరిశోధనలో అంతుబట్టకూడదని చివరకి ట్రయిన్‌లోంచి శవం మూటను నెట్టేసి వచ్చాను.

నేను చేసిన హత్య ముడి వీడిపోకుండా జాగ్రత్తపడ్డాను. అయితే ఎస్తేరురాణి భయం నాకు పట్టుకుంది నాఅక్కను అడిగాను. అడ్రసు ఇచ్చింది. మొదట అడ్రసు చెప్పడానికి భయపడింది. నేను నమ్మించి చిరునామ తెలుసుకుని ఆరాత్రి బయల్దేరి సేలమ్ చేరుకున్నాను. ఒంటరిగా ఉన్న ఆమెను చంపడం చాలా తేలికయ్యింది."

డేవిడ్‌ను రెండు రాష్ట్రాల పోలీసులు రెండు హత్యలలో కేసు నమోదు చేసారు. ★

కథా నిలయం
శ్రీకాకుళం

# స్పెయిన్ హోలీ!

హోయ్ బాస్! అంతా బాగేనా!! అన్నట్టు మార్చి 11న మీలో ఎంతమంది హోలీ ఆడారు? రంగునీళ్లు కలుపుకొని ఒకరిమీదొకరు చల్లుకుంటుంటే ఎంత మజాగా వుంటుంది?

హలో... ఏంటి బాస్. మేమేమో చెప్పుకుపోతున్నాం. మీరేమో నీరసంగా చూస్తున్నారు? ఏంటో! పేరుకి యూత్. చేష్టలేమో! ... ఎందుకులే! పాయింట్‌కొచ్చేద్దాం.

హోలీలాగా ఆడే మరో ఆట వుంది. కాకపోతే మనదేశంలో కాదులే. ఈ భూప్రపంచంలోనే ఒక చోట వుంది. అదేంటో... ఎక్కడో మీకు తెల్సా! అరే... మళ్లీ అదే ఫీలింగ్. చూడలేక చస్తున్నాంరా బాబూ. సరే అసలు విషయానికొచ్చేస్తాం. స్పెయిన్‌లో టమోటాలను విసురుకుంటూ హోలీలాగా ఆడతారు. ఈ ఏడాది ఆ ఉత్సవం ఇటీవలే ముగిసింది. ఎప్పుడంటే ఆగస్టు 26వ తేదీన. ప్రతి సంవత్సరం ఆగస్టు చివరి బుధవారం రోజు ఆ పండుగ జరుపుకుంటారు.

చూడ్డానికి హోలీలాగా చాలా తమాషాగా వున్నా...బోలెడంత వినోదాన్ని అందిస్తుంది. ఆరోజున బునల్ పట్టణంలో జనాలంతా పోగవుతారు. ఇంక టమోటాలతో ఫైటింగ్ మొదలెడతారు. దీన్నే టమోటాలు విసురుకునే పార్టీ అని కూడా అనుకుంటారు. ఒకరిమీదొకరు బాగా పండిన ఎర్రటి టమోటాలను విసురుకుంటుంటే వుంటుందీ! అసలు చదువుతుంటేనే ఇంత మజాగా వుందే మరి అసలు సీన్‌లో వున్నవారికెలా వుంటుంది? మనం కనుక హోలీరోజున రంగులు చల్లుకున్నప్పుడు ఎలా వుంటాం? నిండా రంగుతో విచిత్రంగా తయారౌతాంకదా. వీళ్లు కూడా అలాగే ఎర్రగా అయిపోతారు.

సరే...ఇంతకీ ఈ ఉత్సవాన్ని అక్కడ ఎప్పటినుంచి జరుపుకుంటున్నారనుకుంటున్నారు? 1940 నుంచి. నేస్తాలంతా పోగయ్యి బాగా ఎంజాయ్ చేస్తార్లే. ప్రపంచంలోకెల్లా ... ఆహారపదార్థాలను విసురుకునే అతి పెద్ద ఉత్సవం ఇదే.

**వారంరోజుల సందడి**

బునల్ పట్టణంలో పదివేలమంది జనాభా వుంటే...ఈ ఉత్సవంలో పాల్గొనడానికి యాభైవేలమంది దాకా పర్యాటకులు ప్రపంచ నలుమూలల నుంచీ వస్తారు. 100,000 కిలోల టమోటాలను విసురుకుంటారు. అసలు ఉత్సవానికి ముందు వారం రోజుల పాటు బోలెడన్ని పోటీలు వుంటాయి. ఇందులో వంటల పోటీ, టపాసుల పోటీ కూడా వున్నాయి.

వారంరోజుల ఉత్సవాలు ఒక తమాషా తంతుతో మొదలౌతాయి. ఇందులో మొదటి ఫీట్ ఏంటంటే...ఒక ఎత్తైన నున్నటి దిమ్మె మీద పందిమాంసం ముక్క పెడతారు. దిమ్మెకు గ్రీజ్ పూస్తారు. ఇంక చుట్టూ జనాలు చేరి దిమ్మె మీదున్న పందిమాంసం ముక్కను తీసే ప్రయత్నం చేస్తుంటారు. ఇది జరుగుతుండగానే చుట్టూ వున్నవారు పాటలు పాడుతూ, డాన్స్ చేస్తూ వారిని ప్రోత్సహిస్తుంటారు. మెల్లగా ఒకరికొకరు సాయం చేసుకుంటూ పందిమాంసం ముక్కను సొంతం చేసుకుంటార్లెండి. ఆ దెబ్బతో పండిన టమోటాలను ట్రక్కులకొద్దీ రోడ్లమీద దించేస్తారు. అబ్బా మనకు ఇంత ధర పలుకుతుంటే టమోటాలను అలా రోడ్లమీద పోసి ఆడుకుంటారా? అనుకుంటున్నారనుకుంటా! అదేంలేదండీ. అక్కడ ఈ పండుగ కోసం ప్రత్యేకంగా పండిస్తారు. పైగా చవక కూడా.

మరో తమాషా విషయం! బాగా పండిన టమోటాలను వాడడం వల్ల ఎలాంటి ప్రమాదమూ వుండదు. పైగా ప్రతి ఒక్కరూ టమోటాను విసరబోయేముందు దాన్ని పిండుతారు. రసం పోవడం వల్ల పెద్దగా దెబ్బ తగలదు. అయితే ముందు జాగ్రత్త కోసం కళ్లజోడు, చేతి తొడుగులు తగిలించుకుంటారు. కాకపోతే హోలీలో లాగా ఎటువంటి సీసాలను అనుమతించరు.

ఆరోజున ఉదయం పది గంటలకు ఆట మొదలౌతుంది. టమోటాలు విసురుకోవచ్చు. అయితే సరిగ్గా గంటకు అందరూ టమోటాలను విసరడం ఆపేస్తారు. తర్వాత షవర్ కింద అంతా శుభ్రంగా స్నానం చేసేస్తారు. రోడ్లన్నీ శుభ్రం చేస్తారు. టమోటా హోలీ ముగిసిపోయినట్టు.

★

కథ

ఒక్కక్షణం ఆమెని చూసి చూపు తిప్పుకోవడం కష్టమైంది నాకు. ఎన్నో ప్లాస్టిక్ పువ్వులని కళ్ళతో చూసిన నాకు మంచుతో తడిసిన అరవిరిసిన గులాబీలా అనిపించిందామె!" సుమంత్ మాటలు పూర్తికానేలేదు. ఆనందం పట్టలేక పెద్దగా నవ్వసాగాడు రామచంద్రయ్య. రాధిక సిగ్గుతో లోపలికి తుర్రుమంది. విశాలాక్షి పైటకొంగు సరిగా సర్దుకుంటూ గుమ్మం వెనక్కి జారుకుంది.

"నువ్వు భలేవాడివి బాబూ... మీ నాన్న వేషాలన్నీ ఉన్నాయి మీ దగ్గర. ఒక్క నిమిషం హడలగొట్టేశావు కదా... అలాంటి వాడి కడుపున ఇలాంటి వాడెలా పుట్టాడా అనుకున్నా అప్పుడే.. మరిప్పుడైనా అవి తీసుకో బాబూ" అంటూ స్వీట్స్ వైపు చేయి చూపించాడు రామచంద్రయ్య పరమానందంతో.

"నా మీద ఎంతో యిష్టంతో అభిమానంతో ఎంతో కష్టపడి అన్ని రకాలు చేసి ఉంటారు. నన్ను క్షమించండి. అవన్నీ నేను తినలేదు" అన్నాడు సుమంత్.

# గతితప్పితే...!

**పైడికొండల దుర్గాదేవి**

**ప**డవంత పొడవైన ఆ ఎర్రటి కారు రామాపురం వీధుల్లో దూసుకుపోతూ ఉంటే అందరి కళ్ళు దానిమీదే.

అది అలా దూసుకువెళ్ళి దూసుకువెళ్ళీ రామచంద్రయ్య ఇంటి ముందు ఆగడంతో ఆశ్చర్యంతో ఇంత లావున నోళ్ళు తెరిచారు గ్రామస్థులు.

"అంత పెద్ద కారా? అని ఆశ్చర్యం. ఎవరొచ్చారు! ఎందుకొచ్చారో" అని కుతూహలం. అదంతా ఎందుకూ ఏమిటీ అని తొందరగా తెలుసుకోవాలన్న ఆతృత.

అంతా అలా నోరెళ్ళబెట్టి చూస్తూ ఉండగా కారు డోరు తెరచుకుని కిందికి దిగాడు ఒక అందమైన యువకుడు. తెల్లగా, పొడవుగా ఉన్నాడు. అక్కడ చేరిన వాళ్ళ పరిభాషలో చెప్పాలంటే దొరబాబులాగా ఉన్నాడు. అందంగా, హుందాగా ఉన్నాడు. దానికి తగిన వస్త్రధారణ చేసుకున్నాడు. లేత నీలం రంగు సూట్‌తో అతని అందం, హుందాతనం ద్విగుణీకృతమైనాయి. ఇక అతని డాబు, దర్పానికి ఆ కారూ, ఆ టీవీ సరేసరి... అంతటి మనిషి తనకి రెండు చేతులూ జోడించి నమస్కారం చేసేసరికి జడుసుకున్నాడు చంద్రయ్య. ఊళ్ళో కూలీనాలీ చేసుకుని బతికే మనిషతను.

చంద్రయ్య కంగారు కంగారైపోతూ ఉంటే ఆ యువకుడు నవ్వుతూ "రామచంద్రయ్యగారి ఇల్లు ఇదేనండీ?" అనడిగాడు.

ఆ యువకుడి మాటల్లో అదోరకం యాస ఉంది.

'ఇదే బాబూ" చెప్పాడు చంద్రయ్య కంగారు అణుచుకుంటూ. థాంక్యు అంటూ లోపలికి అడుగులెయ్యబోయాడా యువకుడు.

"ఇంతకీ తమరెవరు బాబూ?" అన్నాడు చంద్రయ్య. ఆ యువకుడు ఆగాడు.

"నా పేరు సుమంత్. హైదరాబాద్ నుంచి వస్తున్నాను. ఈయన మా నాన్నగారి చిన్ననాటి స్నేహితులు. వియ్యంకులు కావాలనుకున్నారు. అందుకే వాళ్ళమాయి రాధికని చూడ్డానికి వచ్చాను. చాలా!" అన్నాడు. చంద్రయ్యతో పాటు అక్కడున్న వాళ్ళంతా మరోసారి నోళ్ళు తెరిచారు.

♦ ♦ ♦

"పూతరేకుల్లో బెల్లం మెత్తగా చూర్ణంలా ఉండాలే.. అలా ముక్కల్లా ఉంటే పంటికింది రాళ్ళలా తగుల్తూ చికాకుగా ఉంటుంది" అన్నాడు రామచంద్రయ్య, వంటింట్లో పూతరేకులు చుడుతున్న విశాలాక్షి చేస్తున్న పనిని శ్రద్ధగా గమనిస్తూ.

"అబ్బబ్బబ్బ.... మీరుండండీ ఒకపక్క ఆ అబ్బాయి ఎక్కడ వచ్చేస్తాడోనని కంగారుపడుతుంటే మధ్యలో మీ గోల ఒకటి...!" విసుక్కుంది విశాలాక్షి.

"గోల కాదే. అబ్బాయి చాలాకాలం తర్వాత అమెరికా నుండి ఇండియా వచ్చాడు. ఇలాంటి రుచులకి మొహంవాచి ఉంటాడు. అన్నీ చక్కగా చేసి పెట్టకపోతే ఎలాగో....!"

"ఎలాగో నాకు తెలుసుకానీ మీరు వెళ్ళండి. వంటింటి గుమ్మం వదిలి వీధిగుమ్మలో నిలబడి అబ్బాయిని ఆహ్వానించండి"

"ఏం తెలుసే నీకు!.. అహ..ఏం తెలుసని, నీకు తెలిసేడిస్తే ఆ సున్నుండలు అలా క్రికెట్ బంతులంత చేస్తావా!.. వాటిని చూడగానే పారిపోడా ఆ కుర్రాడు. నగరాల్లో పెరిగిన నాజూకు యువకుడే అతను...!"

"ఆఁ.. ఎంత నగరాల్లో పెరిగినా చిన్నప్పుడు ఈ పల్లెటూల్లో ఉన్నవాడేగా. అత్తయ్యా.. అత్తయ్యా.. అంటూ నా కొంగు పట్టుకు తిరిగేవాడు. ఏమైనా పెట్టవా అని వేధించేవాడు. అంతంత సున్నుండలు చేసి యిస్తే యింత నెయ్యి తీసుకుని తృప్తిగా తినేవాడు".

"చాల్చాలు ఆపు.. నువ్వు గతంలోకి వెళ్ళిపోకు. వర్తమానం అల్లకల్లోలమైపోయి అది మనమ్మాయి భవిష్యత్తుకే ఎసరు పెడుతుంది".

"మీకన్నీ వెటకారాలే.. చూస్తుండండి... నేను చేసిపెట్టిన వాటిని ఎంత ఆప్యాయంగా, అపురూపంగా తింటాడో..!"

"ఆఁ... చూద్దాం... చూద్దాం... అపురూపంగా తింటాడో... జన్మలో ఇలాంటి వంటకాల పేరెత్తకుండా జడుసుకుంటాడో.. అదీ చూద్దాం. మరీ సినిమాల్లో రాక్షసులు తినే సైజులో తయారు చేశావ్ అన్నీ. అంతంత తిండి

పదార్థాలు చూసి జడుసుకుంటాడో ఏమో!".

"మీది మరీ చోద్యం లెండి. ఆ బర్గర్లు అవీ చూస్తాంకదా టీవీలో. ఎంత బావుంటాయవి. వీటిని చూసిన కళ్లతో వాటిని చూస్తే చిన్నవిగానే ఉంటాయి లెండి!"

వాళ్ళిద్దరి వాదన యింకా ఎంతసేపు నడిచేదో గానీ, అంతలోనే గుమ్మంలో "లోపలికి రావచ్చా... అంకుల్" అని వినిపించింది.

♦ ♦ ♦

ఆ మాట విని ఉలిక్కిపడింది రాధిక. అప్పటికి ఆమె అద్దంతో నేస్తంకట్టి గంటన్నర దాకా అవుతోంది. తనూ, అద్దం ప్రాణస్నేహితులైపోయారు గానీ ఆమె అలంకరణ మాత్రం తెమలలేదు.

"మీకన్నీ వెటకారాలే.. చూస్తుండండి... నేను చేసిపెట్టిన వాటిని ఎంత అప్యాయంగా, అపురూపంగా తింటాడో..!"

"ఆఁ... చూద్దాం... చూద్దాం... అపురూపంగా తింటాడో... జన్మలో ఇలాంటి వంటకాల పేరెత్తకుండా జడుసుకుంటాడో.. అదీ చూద్దాం. మరీ సినిమాల్లో రాక్షసులు తినే సైజులో తయారు చేశావ్ అన్నీ, అంతంత తిండి పదార్థాలు చూసి జడుసుకుంటాడో ఏమో!".

"మీది మరీ చోద్యం లెండి. ఆ బర్గర్లు అవీ చూస్తాంకదా టీవీలో. ఎంత బావుంటాయవి. వీటిని చూసిన కళ్లతో వాటిని చూస్తే చిన్నవిగానే ఉంటాయి లెండి!"

వాళ్ళిద్దరి వాదన యింకా ఎంతసేపు నడిచేదో గానీ, అంతలోనే గుమ్మంలో "లోపలికి రావచ్చా... అంకుల్" అని వినిపించింది.

తనకున్న బట్టలన్నీ ప్రదర్శనలా పేర్చింది మంచం మీద. అటూఇటూ తిరుగుతూ పరిశీలనగా చూసింది చాలా సేపు. చివరికి ఆకుపచ్చలంగా, గులాబిరంగు చీర ఎన్నిక చేసింది.

ఆ తర్వాత జడ... నాలుగైదు రకాలుగా వేసి, విప్పి ఆరో రకాన్ని నికరం చేసింది.

తర్వాత స్థానం బొట్టుబిళ్ళ. వేళ్ళు నొప్పి పుడుతున్నా అతికించుకోవడం, పీకడం మాత్రం మానలేదు. చివరికి ఒకదానికి ఆమె నుదుటిని అలంకరించే భాగ్యం దక్కింది.

ఇక చెవి రింగులు, మెళ్ళో నగలు సంగతైతే చెప్పనక్కర్లేదు. అంతలా కుస్తీ పట్టి బుట్టబొమ్మలా తయారైనా ఆమెకేం తృప్తిగా అనిపించలేదు తన అలంకరణ. 'అమెరికా దాకా తిరిగొచ్చాడు అతను ... ఇలాంటి పల్లెటూరి అమ్మాయి, అలంకరణా నచ్చుతుందా... నామొహం!' అనుకుంది. అంతలో అతని మాట వినిపించింది. అందుకే అంతలా ఉలిక్కిపడింది.

చిన్నప్పుడు చేయి చేయి కలిపి ఆడిపాడిన నేస్తమే అతను. కాకపోతే యవ్వన ప్రాంగణాన అడుగుపెట్టాక తొలిసారిగా ఎదురవ్వబోతున్నాడు.

ఎలా ఉంటాడో ఏమిటో.. తొందరగా చూసెయ్యాలి. అంటోంది ఆమె మనసు.

ఎందుకంత తొందర? తినబోతూ రుచి ఎందుకు?! అంటోంది ఆ మనసే.

అందుకే ఆమెలో ఆ అలజడి. అంతలో "దా బాబూ! కూర్చో... యిప్పటిదాకా నీ గురించే గుమ్మంతో నిలబడి ఎదురుచూసి యిప్పుడే లోపలికి వచ్చాను!" కంగారు కంగారుగా చెప్తున్నాడు తండ్రి.

0000

"అదిగో... అదే మా అమ్మాయి రాధిక.. ఎప్పుడో చిన్నప్పుడు చూశావు" గదిలోంచి బయటికి వచ్చిన రాధికని చూపిస్తూ సుమంత్‌తో అన్నాడు రామచంద్రయ్య.

ఒక్కక్షణం.. ఒకేఒక్క క్షణం చూశాడామె వైపు. మళ్ళీ మామూలుగా తల తిప్పేసుకుని కూర్చున్నాడు సుమంత్. చివుక్కుమంది రాధికకి.

"తీసుకోబాబూ.. నువ్వొస్తున్నావని ఎంతో కష్టపడి చేసింది మీ అత్తయ్య" అంటూ టేబుల్ మీది స్వీట్స్ చూపించాడు రామచంద్రయ్య. "మీకేమైనా స్వీట్స్ షాప్ ఉందా అంకుల్?" అన్నాడు సుమంత్ వాటిని చూస్తూ. "ఇలాంటివన్నీ తింటే ఒళ్ళంతా ఫ్యాట్ పట్టేసి తర్వాత గుండె, రక్తనాళాలు మూసుకుపోయి చిన్న వయసులోనే ఢాం అంటాం. నాకింకా చాలాకాలం బ్రతకాలం ఉంది. నాన్నొద్దిలేయండి".

విశాలాక్షి ఎంతగానో నొచ్చుకుంది అతని మాటలకి. "సీ అంకుల్... నాకు డొంకతిరుగుడుగా మాట్లాడడం ఇష్టం ఉండదు. ఏదైనా ముక్కుసూటిగానే చెప్తాను. డాడీ మీకు చిన్ననాటి స్నేహితుడట కదా. నేనూ చిన్నప్పుడు ఇక్కడే తిరిగానట. నాకైతే గుర్తులేదు. నాన్న వ్యాపారం కోసం ఊరూరా తిరుగుతూ హైదరాబాద్‌లో సెటిలైనా మిమ్మల్ని మాత్రం మరచిపోలేదు. నేను అమెరికాలోనే చదువుకుని అక్కడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఉండగా ఏనాడూ చేయని ప్రస్తావన, నా ఉద్యోగం పోయి, సాఫ్ట్‌వేర్ బూమ్ ఎలాగూ పోయింది కదాని నేను ఇండియాలో ఏదో ఒకటి చేసుకుందాం అన్న ఆలోచన చేయగానే ప్రస్తావించారు ఆయన.

అది... నేను మీ అమ్మాయి రాధికని పెళ్ళి చేసుకోవాలని. నాకు ఆశ్చర్యం వేసింది.

అదేంటి ఈ విషయం ఇంతకుముందెప్పుడూ అనలేదు.!అనడిగాను.

'అప్పుడు నువ్వు అమెరికాలో ఉన్నావు. అమెరికాలో సెటిల్ అవుదాం అన్న ఆలోచనలో ఉన్నావు. అటువంటి వాడికి రామచంద్రయ్య ఒక్కగానొక్క కూతుర్నిచ్చి పెళ్ళి చేసి అమెరికా పంపిస్తే వృద్ధాప్యంలో ఆ దంపతుల్ని ఎవరు చూసుకుంటారు? అందుకే ఆ ఆలోచనని నాలోనే దాచుకున్నాను. యిప్పుడు సాఫ్ట్‌వేర్ బూమ్ పడిపోయింది. చాలమందికి భ్రమలు తొలగాయి. నువ్వు కూడా ఇండియాలో స్థిరపడదాం అనుకున్నావు. అందుకే ఇప్పుడు నాకీ విషయం చెప్తున్నాను' అన్నారాయన.

'సరే.. మీ ఆలోచన మీరు చెప్పారు. కానీ నాకు మీ స్నేహితుడి కూతురు నచ్చాలి కదా! అన్నాను నేను'.

'అందుకే ఒకసారి రామాపురం వెళ్ళి అమ్మాయిని చూసుకో. నచ్చితేనే చేసుకో. అమ్మాయి నీకు నచ్చితే నా చిన్ననాటి నేస్తం నేను వియ్యంకులమవుతాం. లేదంటే స్నేహింతుల్లాగే ఉండిపోతాం' అన్నారు ఆయన.

"విషయం ఎలాగో ఆయన మీకు ఫోనులో చెప్పి ఉంటారు కదా. యిప్పుడు నేను నా నిర్ణయం చెప్పాల్సి ఉంది" అంటూ ఆగాడు సుమంత్.

అతడి ప్రవర్తనా, వాలకం చూస్తే ఆ నిర్ణయం ఏమిటో అర్థమైపోతూనే ఉంది వాళ్ళకి.

అయినా అతనేం చెప్తాడా అని చూస్తున్నారు. "ఫైనల్‌గా నా నిర్ణయం ఏమిటంటే... మీ అమ్మాయి అంటే నాకు.. నాకు.. నాకిష్టమే. ఒక్కక్షణం ఆమెని చూసి చూపు తిప్పుకోవడం కష్టమైంది నాకు. ఎన్నో ప్లాస్టిక్ పువ్వులని కళ్ళతో చూసిన నాకు మంచుతో తడిసిన అరవిరిసిన గులాబీలా అనిపించిందామె!" సుమంత్ మాటలు పూర్తికానేలేదు. ఆనందం పట్టలేక పెద్దగా నవ్వసాగాడు రామచంద్రయ్య. రాధిక సిగ్గుతో లోపలికి తుర్రుమంది. విశాలాక్షి పైటకొంగు సరిగా సర్దుకుంటూ గుమ్మం వెనక్కి జారుకుంది.

"నువ్వు భలేవాడివి బాబూ... మీ నాన్న వేషాలన్నీ ఉన్నాయి మీ దగ్గర. ఒక్క నిమిషం హడలగొట్టేశావు కదా... అలాంటి వాడి కడుపున ఇలాంటి వాడెలా పుట్టాడా అనుకున్నా అప్పుడే.. మరిప్పుడైనా అవి తీసుకో బాబూ" అంటూ స్వీట్స్ వైపు చేయి చూపించాడు రామచంద్రయ్య పరమానందంతో.

"నా మీద ఎంతో యిష్టంతో అభిమానంతో ఎంతో కష్టపడి అన్ని రకాలు చేసి ఉంటారు. నన్ను క్షమించండి. అవన్నీ నేను తినలేదు" అన్నాడు సుమంత్.

"ఏం బాబూ?" అన్నాడు రామచంద్రయ్య.

"గతికితే అతకదంటారు కదా మావయ్యా...!"

మళ్ళీ ఆనందంతో పెద్దగా నవ్వసాగాడు రామచంద్రయ్య. ★

# నవ్వుల్ - పువ్వుల్

## రుజువు

**శ్యామ్:** పక్షులకు మనకంటే చూపు ఎక్కువని రుజువు చేయగలవా?

**రామ్ :** ఆ ...

**శ్యామ్ :** ఎలా?

**రామ్ :** ఎక్కడైనా ఏ పక్షి అయినా కళ్లజోడు పెట్టుకోవడం చూశావా? అదే రుజువు.

## ఎంత తాగాలి?

'భర్తల తాగుడును సహించలేక చాలామంది భార్యలు విడాకులు కావాలంటున్నారు....' స్టేజి మీద ఉపన్యసిస్తున్నాడు ఫ్యామిలీ కౌన్సిలర్.

'రోజుకి ఎన్ని పెగ్గులు తాగితే అలా అడుగుతారు' ప్రేక్షకుల్లో ఉన్న వెంకటేశం ప్రశ్నించాడు ఆసక్తిగా.

## ఆయనే చెప్పాడు

**(పనిమనిషి బాగా చెయ్యడంలేదంటూ పన్లోంచి తీసేసింది లక్ష్మి.)**

**లక్ష్మి:** మచ్చుకు ఒక్కటంటే ఒక్కపని నాకంటే బాగా చేసినట్లు చెప్పు నిన్ను మళ్లీ పనిలోకి తీసుకుంటా.

**పనిమనిషి:** వంట మీకంటే బాగా చేస్తా.

**లక్ష్మి:** ఎవరు చెప్పారు, మా ఆయనేనా?

**పనిమనిషి:** కాదు, మన వీధి బిచ్చగాడు.

## ఎక్కడుంటావ్?

'నాకేం దిగులండీ రత్నాల్లాంటి ముగ్గురు పిల్లలు. ఒక్కొక్కరి దగ్గరా నాలుగు నెలలున్నా ఏడాది గడిచిపోతుంది' మనవణ్ణి ఒళ్లో కూర్చోపెట్టుకుని స్నేహితుడితో కబుర్లు చెబుతున్నాడు. ఈ మధ్యే రిటైరైన పరంధామయ్య.

'మరి రెండో ఏడాది నుంచి ఎక్కడుంటావ్ తాతయ్యా? ఆరా తీస్తున్నట్లు అడిగాడు మనవడు.

## డేంజర్

'డ్రైవింగ్‌లో తాగడం డేంజర్. అందుకే కారు నడిపేటప్పుడు నేను అస్సలు తాగను. అనుభజ్ఞులు చెప్పిన మాట అది' అన్నాడు రమేశ్.

'కరెక్టే... నాకూ ఆ అనుభవం ఉంది. గేరు మార్చినా, బ్రేక్ వేసినా ఒలికి పోతుంది కదా. అలా వేస్ట్ చేయడంకన్నా తాగకపోవడమే మంచిది' చెప్పాడు గణేష్.

## మోసం

'నువ్వు నన్ను మోసం చేశావ్' వస్తూనే కోపంగా అరిచాడు వెంగళప్ప షాపతనితో.

'ఏం జరిగింది?'

'నిన్న నీదగ్గర కొన్న రేడియో మీద 'మేడిన్ జపాన్' అని రాసుందా! ఇంటికి వెళ్లి ఆన్ చేయగానే 'దిసీజ్ ఆల్ ఇండియా రేడియో' అని వస్తోంది?!

## అందుకే చెప్పాను

'పక్కింటాయన ఎందుకూ పనికిరాని సన్నాసటండీ, వాళ్లావిడ చెప్పింది....' భర్తతో అంది సుబ్బలక్ష్మి.

'సరే, నామీద నువ్వేమి చెప్పలేదుకదా' అనుమానంగా అడిగాడు భర్త.

'భలేవారండీ, నేనేమీ చెప్పకపోతే ఆవిడమాత్రం ఎలా చెబుతుందీ...' అసలు రహస్యం చెప్పేసింది సుబ్బలక్ష్మి.

## వాళ్లు చాలా బిజీ!

'హలో బాబూ మీ అమ్మా నాన్న ఉన్నారా?'

'వాళ్లు చాలా బిజీగా ఉన్నారు?'

'ఇంకా మీ ఇంట్లో ఎవరున్నారు?'

'ఇద్దరు పోలీసులు'

'వారితో మాట్లాడాలి పిలువు'

'వాళ్లూ బిజీగా ఉన్నారు'

'ఇంతకీ వాళ్లంతా ఏం చేస్తున్నారు?'

'నేనెక్కడున్నానో వెతుకుతున్నారు.'

'ఆఁ.....?



# చిన్ని చిన్ని ఆశ...



గ్రామాల్లో, ఓ మాదిరి పట్టణాల్లో చిన్న చిన్న వృత్తులు చేసుకుంటూ జీవనం గడిపేవారి ముఖాల్లో తొణికసలాడే ఆత్మస్థైర్యాన్ని, తామేదో కష్టం చేస్తున్నమన్న భావనతో కాకుండా, ఆ పనిలో ఎంతో ఆనందంగా నిమగ్నమయ్యే వారి స్వభావాన్ని తన కళాత్మక దృష్టితో చిత్రాల ద్వారా ఆవిష్కరించాడు కర్నాటకకు చెందిన సత్య శివకుమార్. కొన్ని రోజుల పాటు వారితో కలిసి గడపడం ద్వారా ఆ పనుల స్వభావాన్ని పూర్తిగా అవగతం చేసుకొన్నాడు. ఇలాంటి వారిలో పుష్కలంగా ఉండే ఆశాభావానికి ప్రతీకగా ఆయన వెలుతురును తీసుకున్నాడు. అందుచేతనే ఆ చిత్రాలలో దీపాలు, దీపాల వెలుతురు, సూర్య కాంతి ప్రముఖంగా కనిపిస్తాయి. తాను వ్యక్తం చేయదలుచుకున్న అంశాలను బలంగా  చూపడానికి రకరకాల వర్ణాలకు బదులు, ముదురు గోధుమ రంగు ఒక్కదాన్ని మాత్రమే తీసుకోవడం ఆయన ప్రత్యేకత. ఆ వర్ణాన్ని విభిన్న చాయలతో అంటే మోనోక్రోమ్ పద్ధతిలో వినియోగించుకొని తాను అనుకున్నది సాధించాడు శివకుమార్. 2009 అగస్టు 29 నుండి సెప్టెంబరు 6 వరకు హైదరాబాదు గ్యాలరీస్పేస్‌లో ప్రదర్శించిన ఆయన చిత్రాలలో ఇవి కొన్ని.

-జి.వి



# నీలిరంగు నక్క

- కె.సాహిల్

అనగనగా ఓ నక్క వుండేది. అది అడవి లోపల దట్టమైన భాగంలో నివసించేది. ఓసారి అది ఆహారం కోసం వెతుకుతుంటుంది. పాపం ఎంత తిరిగినా పిసరంత మాంసం కూడా దొరకదు. ఆకలి నకనకలాడుతుంటుంది. ఏం చేయడానికి పాలుపోక అలా నడుచుకుంటూ నడుచుకుంటూ నగరంలోకి ప్రవేశిస్తుంది. ఇక్కడైతే ఏదో ఒక ఆహారం లభిస్తుందని ఆశ. అయితే దానికి గుండెలో గుబులుగానే వుంటుంది. జనాలు, కుక్కలు తనను చూస్తే... ఇంకేమైనా వుందా! ప్రాణాలతో వదులుతాయా? అందుకే అవేవీ తనకు ఎదురుపడకూడదని వెయ్యిదేవుళ్లకు మొక్కుకుంటుంది.

అయితే అంతలోనే కుక్కల అరుపు వినిపిస్తుంది. ఒక్కసారిగా పరుగు లంకించుకుంటుంది. కానీ కొంతదూరం పోయాక కుక్కలు దానికి సమీపంగా వచ్చేస్తాయి. ఏం చేయాలో తోచుబాటుకాక నక్క ఓ ఇంట్లో జొరబడుతుంది. అది అద్దకాలు వేసే వ్యక్తి ఇల్లు. ఒక బొచ్చె నిండా నీలం రంగు కలిపి వుంటుంది. నక్క చూసుకోకుండా అందులో పడిపోతుంది. కుక్కలు కూడా అటుగా వస్తాయికానీ నక్కను గుర్తించలేకపోతాయి. ఇంక చేసేదేముంది! తోకలు ముడుచుకుని వెళ్లిపోతాయి. కుక్కలు ఆ పరిసరాల్లో లేవన్న విషయాన్ని నిర్ధారించుకున్నాకగానీ నక్క రంగుగిన్నెలోంచి బయటకు రాదు! తీరా వచ్చాక చూసుకుంటే ఏముంది? నిండా నీలం రంగు. అసలు తన శరీరపు వర్ణమే మారిపోయింది. మొదట దాన్ని వదిలించుకోవడం ఎలాగబ్బా...అనుకున్నా... తిరిగి అడవిలోకి వెళ్లిపోవాలనుకుంటుంది. పరుగు లంకించుకుంటుంది మళ్లీ. అయితే మార్గమధ్యలో దీన్ని చూసిన జంతువులన్నీ భయంతో పెద్దగా అరవడాన్ని గమనిస్తుంది. అంతలోనే మెరుపులాంటి ఆలోచన మనసులో మెదులుతుంది.

"అవునూ... పెద్ద పెద్ద జంతువులు కూడా నన్ను చూసి బెదిరిపోతున్నాయికదా. నేనెందుకు పరిగెత్తాలి?" అనుకుంటుంది. వెంటనే తమాయించుకొని...

"మీరు ఎందుకు పరిగెడుతున్నారు? వెనక్కిరండి. నా మాట వినండి" అంటుంది. ఆ మాటతో జంతువులన్నీ పరుగు ఆపి నిలబడతాయి. అయితే నక్కకు దగ్గరగా రావడానికి మాత్రం భయపడతాయి.

"రండి. అందరూ రండి. మీ మిత్రులను కూడా పిలవండి. మీ అందరికీ ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి" అంటుంది.

ఒక దాని తర్వాత ఒకటిగా జంతువులన్నీ నక్క దగ్గరకు వెళతాయి. పులులు, ఏనుగులు, కోతులు, కుందేళ్లు, లేళ్లు... ఎన్నో జంతువులు నక్కను సమీపిస్తాయి.

"మీరు నన్ను చూసి భయపడనవసరం లేదు. మీకొచ్చిన ప్రమాదమేమీ లేదు. నన్ను దేవుడే ఇక్కడకు పంపాడు. ఎందుకో తెలుసా! మీ రాజుగా నన్ను వుండమన్నాడు. మీ అందర్నీ నేను కాపాడతాను" అంటుంది. ఈ మాటలను జంతువులన్నీ విశ్వసిస్తాయి.

"చిత్తం రాజా!" అంటూ తల వంచి నమస్కరిస్తాయి. అంతేకాకుండా "మిమ్మల్ని మా రాజుగా అంగీకరిస్తున్నాం. మిమ్మల్ని ఇక్కడకు పంపినందుకు దైవానికి ధన్యవాదాలు తెల్పుకుంటున్నాం. దయచేసి ఆజ్ఞాపించండి మహారాజా! మీకోసం ఏం చేయమంటారు?" అడుగుతాయి వినయంగా.

"మీరు మీ రాజును జాగ్రత్తగా చూసుకోవాలి. అతనికవసరమైన ఆహార అవసరాలన్నీ మీరే చూసుకోవాలి" అంటుంది నక్క కాస్త ఫోజు పెట్టి.

"సరే మహారాజా! మా రాజుగారు సుఖంగా వుండడానికి ఏమైనా చేస్తాం. ఇంకా మీకోసం ఏం చేయమంటారు?"

"మీరు మీ రాజుపట్ల గౌరవంగా వుండాలి. అప్పుడు రాజు మిమ్మల్ని కాపాడతాడు" అంటుంది నక్క సమాధానంగా.

ఆ మాటలతో జంతువులన్నీ సంతోషపడతాయి. అప్పటినుంచి, అవన్నీ కలిసి మాంచి రుచికరమైన ఆహార పదార్థాలను దానికి పంపించసాగాయి. పైగా దానికి ఎటువంటి కష్టం కలగకుండా చూసుకుంటుంటాయి.

నక్క నిజంగా రాజాలాగే కాలం గడపసాగింది. జంతువులు ప్రతిరోజూ తమ సమస్యలను దానికి విన్నవించుకుంటుంటాయి. అవి చెప్పినవన్నీ విని ఏం చేయాలో చెప్తుంటుంది నక్క

ఓరోజు నక్క సభలో కూర్చుని వుండగా....కొద్ది దూరంలో ఓ శబ్దం వస్తుంది.

ఓ నక్కల గుంపు చేస్తోన్న అరుపులవి.

నక్కల ఊళ విని ఎన్ని రోజులైందో! అది ఎంతో సంతోషపడిపోతుంది. కళ్లు ఆనందభాష్పాలతో నిండిపోతాయి. తను రాజునన్న విషయాన్ని మర్చిపోయిన నీలిరంగు నక్క తల పైకెత్తి పెద్దగా ఊళ పెడుతుంది.

దాంతో జంతువులన్నిటికీ తమ రాజు ఎవరో తెల్సిపోతుంది. అది తమను ఇంతకాలంగా మోసం చేస్తూ వచ్చిందని అర్థమౌతుంది.

కోపంతో ఊగిపోతూ దాన్ని తునాతునకలుగా చీల్చిచెండాడాలని ఒక్కపరుగున దానివైపు పరుగు లంకించుకుంటాయి.

కానీ నక్క తెలివితక్కువదా ఏంటి?! ఈ విషయాన్ని అదీ గుర్తిస్తుంది. వెంటనే అక్కడినుంచి బయటపడేందుకు పిక్కబలం చూపెడుతుంది.